ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

Entered

సెప్టెంబర్ 10, 2006

అమెరికా - ఆంధ్రులు



హ్యాపీ బర్త్‌డే

(10.9.2006 నుంచి 16.9.2006వరకు)

దుర్గా భవాని
1సం॥, సెప్టెంబర్-10
బిందుమాధవి-కృష్ణారెడ్డి
మోదుకూరు-గూంటూరు

ఎన్. ప్రత్యూష
8సం॥, సెప్టెంబర్-12
వజ్రాంజని-వెంకటేశ్వర్లు
ఐలవరం-గుంటూరు

శ్రీనిధ్ ఖుశాల్ యాదవ్
1సం॥, సెప్టెంబర్-14
విజయశ్రీ-వంశీయాదవ్
ఇంధన్‌పల్లి-ఆదిలాబాద్

బి. ఝాన్సీలక్ష్మి
1సం॥, సెప్టెంబర్-15
రామలక్ష్మి-శ్రీనివాస్
సామర్లకోట-తూ॥గో॥



బి. భావన
4సం॥, సెప్టెంబర్-16
పద్మ-కృష్ణ
అశ్వారావుపేట-ఖమ్మం

ఎం.డి.జీషాన్ అలి
8సం॥, సెప్టెంబర్-16
జరీనాబేగం-రంజాన్‌అలి
మహబూబాబాద్-వరంగల్

తయ్యబ్ ఖాన్
సెప్టెంబర్-16
షాహీన-రవూఫ్‌ఖాన్
మార్టూరు-ప్రకాశం

కె. గ్రేసీ
2సం॥, సెప్టెంబర్-2004
మణి-యుగంధర్
పల్లెగూడెం-ఖమ్మం

టి. కేథర్‌నాథ్
2సం॥, సెప్టెంబర్-2004
జయమ్మ-శాంతయ్య
బంజారాహిల్స్-హైదరాబాద్



కె. తేజయస్విని
2సం॥, సెప్టెంబర్-2004
అనిత-గిరియాజి
సూర్యపేట-నల్లగొండ

కె. యశస్విని
3సం॥, సెప్టెంబర్-2003
అనిత-గిరియాజి
సూర్యాపేట-నల్లగొండ

పి. నితిన్ కుమార్ రెడ్డి
సెప్టెంబర్-13
శిరోమణి-దామోదర్‌రెడ్డి
తడకనపల్లి-కర్నూలు

ఎం. అరవింద్
సెప్టెంబర్-11
చిట్టెమ్మ-జనార్ధన్
ఆత్మకూరు-కర్నూలు

ఎ. మానస
కృష్ణకుమారి-హనుమంతరావు
నూజివీడు-కృష్ణా

పి. అభిలాష్
4సం॥, సెప్టెంబర్-2002
లావణ్య-సురేష్
వెంకటేశ్వరపురం-నెల్లూరు

ఎస్.ఎస్.పి.కె.కుమారి(ప్రవల్లిక)
సెప్టెంబర్-10
ప్రేమలత-సన్యాసిరావు
విరాట్‌నగర్-విశాఖ

ధరణి
2సం॥, సెప్టెంబర్-2004
విజయలక్ష్మి-పరమేశ్వరరావు
తాడిపత్రి

సాయి వర్షిణి
సంధ్యారాణి-మురళీకృష్ణ
పొదిలి-ప్రకాశం

జి. శరత్‌కుమార్
2సం॥, సెప్టెంబర్-16
పల్లవి-పవన్‌కుమార్
కర్నూల్

చిన్ను
శశికళ-క్రాంతిరాజు
ఉప్పల్-రంగారెడ్డి



కె. చందన
4సం॥, సెప్టెంబర్-4
శైలజ-సుబ్రమణ్యం
విరాట్‌నగర్-ప్రకాశం

అన్నీ మార్కెట్ సంబంధాలే



మన అతిథి గురించి...

పేరు	:	నలిమెల భాస్కర్
నివాసం	:	కరీంనగర్
పుట్టిన రోజు	:	12.2.1956
విద్య	:	ఎంఏ, బిఎడ్, ఎంఫిల్,
హెచ్‌డి		
వృత్తి	:	తెలుగు అధ్యాపకత్వం
ప్రవృత్తి	:	సాహిత్య, సంగీతాదులు అనేక గ్రంథాలు ప్రచురితం 14 భాషల్లో ప్రావీణ్యం
నచ్చని విషయాలు	:	నటన, నయవంచన, ఆచరణలేని శుష్కవాగాడంబరత
నచ్చిన వ్యక్తులు	:	రంగనాయకమ్మ, పోతన, సోమన, గోపన్న, దాశరథి, కాళోజీ, అలిశెట్టి, గద్దర్, గోరటి వెంకన్న
అభిరుచులు	:	చదవడం, భాషాధ్యయనం

సమాజం శరవేగంగా మారుతోంది. పాత విలువలకు, కొత్త విలువలకు సంఘర్షణ సాగుతోంది. ఒకప్పుడు రక్తసంబంధాలు పటిష్టంగా ఉండేవి. మార్క్స్ వచ్చాక అంతర్జాతీయ దృక్పథం అలవడి మానవసంబంధాలకు ఊతం దొరికింది. ఇప్పుడెక్కడ చూసినా లౌక్యం, ప్రయోజనదృష్టి. అందుకే ప్రజాసంబంధాలకూ, పౌరసంబంధాలకూ ప్రాధాన్యం వచ్చింది. అన్నీ మార్కెట్ సంబంధాలు. ఏకంగా విలువలే మారిపోయాయి. మనుషులంతా తెల్లవారిలేచింది మొదలు.. క్రీడాకారులు గనుక ఫుట్‌బాల్, షటిల్‌కాక్, టెన్నిస్ బంతుల వెంట పడ్డట్లు రూపాయి బిళ్లల వెనకాలే పరుగులు తీస్తున్నారు. ఎంత విషాదం! సమస్త మానవజాతిని ప్రాణంలేని ధనం తనచుట్టూ తిప్పుకోవడం ఎంత దు:ఖదాయకం!! మునుపు మానవులకు బదులు 'లోహరాక్షసులు' ఉండేవారట. లోహమైనా కరుగుతుంది. రాక్షసులైనా ఎప్పుడో ఓసారి కదిలిపోతారు. ఇప్పుడు గ్లోబలైజేషన్ పుణ్యమా అని మనమంతా బలై డబ్బు పిశాచాలమవుతున్నాం. అయినా ప్రపంచం గొడ్డుపోలేదు. ఇలా ఎంతచెప్పినా.. విశ్వవీణాతంత్రులూ, భువనభవనపు బావుటాలూ, ప్రపంచపు తెల్లరేకులూ ఎక్కడో ఓచోట ఉంటాయి. ఉన్నాయి. వాటివల్లే ఇంకా ప్రపంచం నడుస్తోంది.

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్ పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
మనమూ మన నమ్మకాలు ... 20

ఇంకా...

ఇలా వుందామా... 7
108

సీరియల్ 8
తెలుగుగడ్డ

కథ 18
అమ్మాయి పెళ్లి

ఆరోగ్యం ... 17
టీ బ్రేక్ ... 21
మనసా... తెలుసా ... 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24



బాధాకరం

ఎయిడ్స్ ప్రపంచాన్ని తాకి 25 సంవత్సరాలయిన నందర్భంగా 'భూతానికి పాతికేళ్ళు' కవర్ స్టోరీ సమయానుకూలంగా ఇచ్చారు. ఈ వ్యాసం ద్వారా ఎయిడ్స్ వ్యాధి గురించి చాలా విషయాలు తెలుసుకున్నాం. లైంగిక సంపర్కం ద్వారా మాత్రమేకాక, ఇతర అనూహ్య పద్ధతుల ద్వారా ఈ వ్యాధి వ్యాపించడం చాలా బాధాకరం. ఎయిడ్స్ వ్యాధికి గురయ్యే కారణాలే ఈ వ్యాధి సోకిన వారిపట్ల అసహ్యాన్ని, దురభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. ప్రమాదవశాత్తూ ఈ వ్యాధిసోకిన వారూ ఉన్నారు. అందుకే ఎయిడ్స్ సోకినవారిని ఈసడించుకోకూడదు. అటువంటి వారిపట్ల జాలి కలిగి ఉండడం ఆవశ్యకం.

రామేశ్వరి, విశాఖపట్నం



టర్నింగ్ పాయింట్

'టర్నింగ్ పాయింట్'లో సత్యజిత్‌రే తీసిన 'పథేర్ పాంచాలి' భారతసినీ చరిత్రను మలుపు తిప్పడం గురించి వివరించారు. భారతీయుల్లోనూ గొప్ప దర్శకులున్నారనీ, వారు అద్భుతమైన సినిమాలు తీయగలరనీ విదేశీయులు గుర్తించడానికి కారణం ఈ చిత్రమే. ఆ ఘనత సత్యజిత్‌రేకు దక్కిన వైనాన్ని చక్కగా వివరించారు.

శాంతి, కమల, కరీంనగర్

విజ్ఞాన వీచిక

'విజ్ఞాన వీచికలో' 'అష్టగ్రహాలా? ద్వాదశ గ్రహాలా లేక...' అంశం చాలా ఆసక్తికరంగా సాగింది. ప్లూటోను ఎలా కనుగొన్నారో చాలా బాగా వివరించారు. గ్రహాలు, గ్రహశకలాల మధ్య తేడా తెలుసుకున్నాం. హ్యాపీ బర్త్ డే చాలా కలర్‌ఫుల్‌గా ఉంటోంది.

కవిత, కార్తీక్, గుడివాడ, కృష్ణా జిల్లా

అద్భుత కళాఖండం

'పథేర్ పాంచాలి'ని పూర్తిచేయడానికి సత్యజిత్‌రే ఎటువంటి గడ్డు పరిస్థితులెదుర్కొన్నారో 'టర్నింగ్ పాయింట్' ద్వారా చాలా చక్కగా వివరించారు. నిజంగా ఈ సినిమా ఓ అద్భుత కళాఖండం. తాను తీసిన సినిమా గురించి వాఖ్యానిస్తూ 'అది చాలా బోర్‌కొట్టేస్తుంది' అని సత్యజిత్‌రే చెప్పడం నిజంగా భారత దేశం గర్వించదగ్గ విషయమే.

గణేష్, ఆర్కే పురం, అదిలాబాద్

బాగుంటోంది

తెలుగు గడ్డ సీరియల్ బాగుంటోంది. క్యాంపస్ ఛాట్ ఆసక్తికరంగా సాగింది. ఆన్‌లైన్ ఫ్రెండ్స్ వల్ల ఎటువంటి కష్టాలెదురవుతాయో చక్కగా వివరించారు. 'విజ్ఞాన వీచిక' శీర్షిక ద్వారా గ్రహాల గురించి తెలుసుకున్నాం. 'టర్నింగ్ పాయింట్' ద్వారా సత్యాజిత్‌రేను పరిచయం చేయడం బాగుంది.

గీత, హైదరాబాద్

చెట్టు మీది శక్తి

'మనమూ మన నమ్మకాలు' శీర్షికలో 'చెట్టుమీది శక్తి' కొన్ని గ్రామాల్లో ప్రజలనుసరిస్తున్న పద్ధతులను తెలిపింది. ఇలాంటి చెట్టుమీది శక్తులను పారద్రోలడం కోసం ఆయా గ్రామస్తులు గొర్రెలు, మేకలను సిద్ధంచేయడం వాస్తవం. ఈ విషయాన్ని ఒక ఊరిని ఉదాహరణగా చూపిస్తూ వివరించడం ఆసక్తి కలిగించింది.

విజయ్, రాంప్రసాద్, హైదరాబాద్

సినిమా కబుర్లు

'సినిమా కబుర్లు'లో 'తెగ మథనపడ్డాను కానీ...' అంటూ కోట శ్రీనివాసరావు చెప్పిన కబుర్లు బాగున్నాయి. బాలనేస్తాలు శీర్షిక చిన్నపిల్లలకెంతో ఆసక్తి కలిగిస్తోంది.

కాశీ విశ్వేశ్వర్, ఖైరతాబాద్

బాగున్నాయి

'తెలుగుగడ్డ' సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. 'సినిమా కబుర్లు' ద్వారా చెబుతున్న విషయాలు చాలా బాగున్నాయి. న్యాయ సలహాలు అందరికీ ఉపయోగకరంగా ఉంటున్నాయి. సెంటర్ స్ప్రెడ్ బాగుంది.

కె. కేశవ్, కడప

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే



లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

రూ. 150/-కే

ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని. నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్చే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3841

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

డా॥ కాకర్లమూడి విజయ్

మలుపు తిప్పిన బఠానీమొక్క



కొన్ని సంఘటనలు జీవితాల్లో గొప్ప మలుపులు తీసుకువస్తాయి. ఆ ప్రత్యేక సంఘటనలే జరగపోయి ఉంటే పరిస్థితులు మరో విధంగా ఉండేవనిపిస్తుంది.

అటువంటి విశేష సంఘటనలు అనేకుల జీవితాలలో అనేకసార్లు జరిగి ఉండవచ్చు. అటువంటి ఒక సంఘటన మాత్రం ఆసక్తికరంగా ఉంది. ఇది జరగకపోతే ఏమై ఉండేదో అనే ఆలోచనలు కలిగిస్తుంది.

గ్రెగర్ మెండెల్. ఈ పేరుకీ, జన్యుశాస్త్రానికీ విడదీయలేని సంబంధం ఉంది. ఆ మాటకొస్తే ఆయనను జన్యుశాస్త్ర పితామహుడంటారు. అయితే ఆయన జన్యుశాస్త్రం అధ్యయనం చేయడానికి నడుం కట్టలేదు. అసలు అప్పటికి జన్యువు అనే మాటే తెలీదు. ఒకానొక సంఘటన ఆయన పేరును ఒక అద్భుత శాస్త్రంతో జోడించింది. అయినా ఇవేవీ బ్రతికుండగా ఆయనకు తెలీదు. మరణానంతరం ఆయన ప్రయోగాలను పునఃపరీక్షించి, ఆ గౌరవాన్నిచ్చారు.

మెండెల్‌కి జీవశాస్త్రమంటే మక్కువ. చిన్నప్పుడు తమ తోటలో పని చేసేవాడు. తర్వాత వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. తన 21వ ఏట 'సన్యాసి' అవ్వాలని తీర్మానించుకున్నాడు. క్రైస్తవ బోధకుడిలాగా మారిన మెండెల్‌ని చర్చ్ వియన్నా విశ్వవిద్యాలయానికి విద్యకోసం పంపింది. తిరిగి వచ్చిన మెండెల్ తను ఉండే మఠంలో భౌతికశాస్త్రం బోధించడం ప్రారంభించాడు. ఇన్ని వైవిధ్యభరితమైన అంశాలను నేర్చుకుని, నేర్పే మెండెల్‌లో మొక్కలపై ఖగోళశాస్త్రంపై ప్రత్యేకించి ఉల్కలపై, పరిణామంపై మక్కువ ఎక్కువగా ఉండేది.

ఈ లక్షణాల వల్లనే మఠంలో పని చేస్తున్నా, మెండెల్ మొక్కలపై ఇష్టాన్ని వదలల్లేదు. మఠ ప్రాంగణంలో చాలా రకాల మొక్కలుండేవి. విశాలమైన ఆ ప్రాంగణంలో మెండెల్ రోజూ పచార్లు చేయడం అలవాటు చేసుకున్నాడు. ఒకనొక రోజు అతని పరిశీలనాత్మకమైన కళ్లకి ఒక ఆసక్తికరమైన మొక్క కనిపించింది. రంగురంగుల పూల మొక్క ఆ ప్రాంగణంలోని మరో పూలమొక్కలాగే ఉంది. కానీ ఏదో వ్యత్యాసం కనిపించింది. ఆ తేడా మెండెల్‌ని ప్రయోగం వైపు నడిపించింది. వెంటనే ఆ మొక్కను తీసుకెళ్లి, తన గది దగ్గర ఉన్న అటువంటి మరో మొక్క దగ్గర నాటాడు. వాటి నుండి ఏర్పడిన సంతానంలో ఏమైనా మార్పు ఉంటుందేమోనని చూశాడు. కానీ పిల్ల మొక్కలు ఎక్కువగా తల్లి మొక్కల లక్షణాలే కలిగి ఉన్నాయి. వెంటనే మెండెల్ బుర్రలో 'అనువంశికత' ఆలోచన మెరిసింది. కానీ అది నిర్ధారించడానికి ఇంకా ప్రయోగాలు చెయ్యాలి. వెంటనే తన మఠంలోని భూమిని ప్రయోగస్థలంగా మార్చేశాడు. అక్కడ మొక్కలు పెంచి, వాటి మధ్య సంపర్కం జరిపింది. మొక్కల లక్షణాలను గమనించాలని అతని ఆశ.

కానీ ఏ మొక్కను తీసుకోవాలి? ఏ మొక్కను నియంత్రణ పద్ధతులలో సంపర్కం జరిపించవచ్చు? అర్థం కాలేదు. ఎన్నో రోజులు ఆలోచించాడు. మరెన్నో రోజులు మొక్కలను పరిశీలించాడు. ప్రతి పువ్వునూ పట్టి చూశాడు. లాభం లేకపోయింది. ఏ పువ్వు చూసినా స్వపరాగసంపర్కం కచ్చితంగా జరిగేట్టే ఉంది. పరపరాగ సంపర్కానికి అప్పటికి మెండెల్‌కి వీలు కన్పించలేదు. కాలం గడిచిపోతోంది గానీ దారి తోచలేదు. ఇక ప్రయోగప్రయత్నం మానేద్దామనుకునే సమయంలో అప్పుడు జరిగిందో సంఘటన.

వసంతకాలం వచ్చింది. అన్ని మొక్కలూ రకరకాల పూలతో నిండి ఉన్నాయి. మెండెల్ అవన్నీ ఇంతకుముందే చూసేశాడు. అతను గమనించనిది ఒకటి కనిపించింది. ఒక బఠానీ తీగె పొడవుగా తెల్లని పూలతో కనిపించింది. మరికొంత దూరంలో అదే బఠానీ తీగె పొట్టిగా కనిపించింది. మొక్క పరిమాణంలో ఈ భేదం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఆ పొట్టి మొక్క పొడవుగా పెరుగుతుందేమో అనుకున్నాడు. ఎన్ని రోజులైనా వాటిలో భేదం మాత్రం మారలేదు. పూలను పరీక్షించాడు. నియంత్రిత సంపర్కానికి అనువుగా ఉన్నాయి. అంతే వెంటనే తనకవసరమైన మొక్క ఏదో మెండెల్‌కి తెలిసిపోయింది. ప్రయోగాలు ప్రారంభించాడు.

ఆ బఠానీ మొక్కపై చేసిన ప్రయోగాలు ఫలించాయి. ఒక మొక్కలో లక్షణాలు, మరొక భిన్న లక్షణాల మొక్కతో కలిసినప్పుడు రెండు లక్షణాల్లో ఏదో ఒకటి మాత్రమే పిల్ల జీవులలో కనిపిస్తుంది, రెండూ కలవవు అని సూత్రీకరించాడు. అంటే పొడవుగానో, లేకపోతే పొట్టిగానో వుంటాయిగానీ మధ్యమంగా రావు అన్నాడు. ఆ లక్షణాలు కూడా చిన్నచిన్న 'పాకెట్ల'లో వుంటాయని, అందులో ఏ లక్షణం బలంగా వుంటే అదే బయటకు కనిపిస్తుందని అన్నాడు. ఇలా ఎన్నో ప్రయోగ ఫలితాలను 1866లో ప్రచురించాడు. అయినా అవి శాస్త్రీయ ప్రపంచాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేకపోయాయి. మెండెల్1884లో మరణించాడు.

మెండెల్ చేసిన ప్రయోగఫలితాలు 1900లో మళ్ళీ పరీక్ష చేయబడ్డాయి. అప్పటికి సూక్ష్మదర్శినివల్ల కణంలోపలి పదార్థాలను కనుగొనగలిగారు. మెండెల్ చనిపోయాక అతని ప్రయోగాలకు బ్రహ్మరథం పట్టారు. మెండెల్ ఊహించిన 'ప్యాకెట్ల'ను జన్యువులన్నారు. ఆయన్ను జన్యుశాస్త్ర పితామహుడన్నారు. చనిపోయిన తర్వాత ఆయనకు గౌరవం దక్కింది.

సరే, బఠానీ మొక్కను ఎంచుకోవడమే మెండెల్ జీవితంలో టర్నింగ్ పాయింటా? అవును. తదనంతర పరిశోధనలలో తేలింది ఏమిటంటే బఠానీ మొక్కలో 7 క్రోమోజోములు, ఏడే జన్యువులు, ఏడే లక్షణాలు వున్నాయి. అంటే ఒక్కో క్రోమోజుపై ఒకే జన్యువు, ఒకే లక్షణం. అందువల్లే మెండెల్ సూత్రాలు స్పష్టంగా వున్నాయి.

ఒకవేళ మరే మొక్కనో తీసుకునుంటే వాటి క్రోమోజోములపై ఒకదానికంటే ఎక్కువ జన్యువులుండేవి. ఎక్కువ లక్షణాలుండేవి, ఫలితాలు నిర్దిష్టంగా వచ్చేవి కావు. మనకు జన్యుశాస్త్రం రావడం ఆలస్యమై వుండేదో... అసలు రాకుండానే వుండేదో?

*

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి.
న్యాయవాది
శ్రీ జి.ఎల్.నరసింహారావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, ప్లాట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

దరఖాస్తును తిరస్కరించారు... కోర్టుకెళ్లాలా?

నేను అలహాబాద్ యూనివర్సిటీ, ప్రయాగ నుంచి హిందీ సాహిత్య సమ్మేళన కోర్సు చేశాను. దానికి సంబంధించిన సర్టిఫికేట్ నా వద్ద ఉంది. ఈమధ్య ప్రకటించిన డిఎస్సీలో హిందీ పండిత్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నాను. ఆ కోర్సు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ యూనివర్సిటీలు నిర్వహిస్తోన్న హిందీ పండిట్ ట్రైనింగ్‌కు సమానం కాదని తెలియజేస్తూ నా దరఖాస్తును తిరస్కరించారు. నేను డిఎస్సీకి అర్హుణ్ణి కానా? కోర్టునాశ్రయిస్తే ఏమైనా ఫలితం ఉంటుందా? దయచేసి తెలుపగలరు.

అరుణ, అదిలాబాద్

హిందీ సాహిత్య సమ్మేళన్ మన రాష్ట్రంలో హిందీ పండిట్ శిక్షణకు సరికాబోదనీ, అందువల్ల మీరు డిఎస్సీకి అనర్హులనీ వారు చెప్పి ఉంటారు. ఇలాంటి సర్టిఫికేట్ కోర్సులు మన రాష్ట్రంలో గల ట్రైనింగ్ కోర్సులకు సమానమైనవా? కాదా? అని తేల్చడానికి ఒక 'నిపుణుల కమిటీ'ని నియమించారు. మీరు చేసిన కోర్సు, హిందీ పండిట్ ట్రైనింగ్‌కు సమానం కాదని ఆ కమిటీ సభ్యులు అందించిన నివేదికలో ధృవీకరించారు. నిపుణుల కమిటీ నిర్ణయాన్ని కోర్టు సమర్థించవలసిందే. కాబట్టి మీరు కోర్టుకెళ్లినా ఎటువంటి ఫలితమూ ఉండదు.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది



పాస్‌పోర్టు దరఖాస్తు...

గతంలో నేను ఒక పాస్‌పోర్టు తీసుకున్నాను. అక్కడి బ్రోకర్లు నాతో దరఖాస్తు నింపించారు. కానీ నేను అంతగా పట్టించుకోలేదు. నేను ఆ దరఖాస్తును మళ్లీ పరిశీలించాను. దాంట్లో నా పుట్టిన తేదీ తప్పుగా ఉందని తెలుసుకున్నాను. దాన్నెలా సరిచేసుకోవచ్చునో తెలపండి

విల్సన్, హైదరాబాద్

మీ దగ్గరున్న సర్టిఫికేట్స్‌లోని డేట్ ఆఫ్ బర్త్ చూపిస్తూ పాస్ పోర్టు అథారిటీ వారికి దరఖాస్తు చేసుకోండి. వారు ఒప్పుకున్నట్లైతే హైకోర్టులో రిట్ వేసి మార్పించుకోవచ్చు.

ఇంద్రగంటి జానకీబాల

పాతబట్టలు

మధ్యాహ్నం వేళ కాలింగ్ బెల్ మోగింది. మంచి నిద్ర చెడిందని విసుక్కుంటూ తలుపు తీసింది శ్యామల. ఎదురుగా గిరిజను చూసి ఆనందపడిపోయింది. నిద్రమత్తు ఎగిరిపోయింది. అనుకోకుండా ఊడిపడిన చిన్ననాటి స్నేహితురాల్ని చూశాక శ్యామలకు ఉత్సాహం వచ్చింది. ఒకే ఊర్లో ఉంటున్నా హైదరాబాద్‌లాంటి మహాపట్టణంలో ఒకర్నొకరు కలుసుకోవడం ఎంత కష్టమో అనుభవపూర్వకంగా గ్రహించుకున్నారు. అందుకే రెండు రోజులకొకసారి ఫోన్‌లో మాట్లాడుకుంటూ, కష్టసుఖాలు కలబోసుకుంటారు.

"ఏమిటే ఒక ఫోనైనా కొట్టకుండా ఊడిపడ్డావ్?" అంది శ్యామల.

"వేరే పనిమీద వచ్చాను. ఫోన్ చేసేందుకు కుదరలేదు. నేను సెల్ ఫోన్ పుచ్చుకు తిరగనుగా" అంది సోఫాలో కూర్చుంటూ గిరిజ.

"పనంటే......"

"ఆ... ఏం లేదు మా బావగారమ్మాయికి పెళ్ళి సంబంధం ఉందంటే వాళ్ళకి తోడుగా వచ్చాను" అంది.

శ్యామల లోపలికెళ్ళింది కాఫీ కలుపుదామని. గిరిజ ఆమెననుసరించింది. "ఇంతకీ నేనింత అర్జంటుగా ఎందుకొచ్చానో అడగవే?" అంది గిరిజ.

"చెప్పు చెప్పు" అంది కాఫీ కలుపుతూ.

"నీదగ్గర చాలా పాత చీరలు, ప్యాంట్లు, షర్టులు ఉన్నాయనీ ఏం చెయ్యాలో తోచటం లేదని నువ్వన్నావు కదా!"

"అవునే, ఇంటినిండా గుడ్డలే. తీరా ఎక్కడికైనా నాలుగురోజులెళ్దామనుకుంటే చీరల్లేవు, బ్లౌజుల్లేవు అనిపిస్తుంది" అంది శ్యామల.

"నాకూ అదే సమస్య. పనివాళ్ళకి ఎన్నని ఇస్తాం. పోనీ యిచ్చినా వాళ్లేమన్నా విశ్వాసంగా ఉంటారా అంటే అదీ లేదు"

"ఈ సింథటిక్ చీరలున్నాయి చూడు వీటిని చూసి చూసి విసుగెత్తిపోయింది. పదేళ్లయినా చిరగవు. నలగవు. ఎవరికీ ఇవ్వబుద్ధేయదు. కట్టుకోవాలంటే పాతచీర కట్టుకున్న ఫీలింగూ"

"ఇంతకీ నేను చెప్పేది విను. ఒక చీరల షాపులో ఈ పాత చీరల ఎక్చేంజి పెట్టాడు. మనం పాత చీరలు పట్టుకెళితే చీరకింతని రేటు కడతాడట. ఆ ధరకు వచ్చినవి, లేదా మరికొంత డబ్బు కలిపి కొత్తవి తీసుకోవచ్చట. దుప్పట్లు, తువ్వాళ్లు కర్టెన్ గుడ్డలు మనిష్టం" అంది గిరిజ.

"హమ్మయ్య మొత్తం ఇల్లు శుభ్రమవుతుంది. నా బీరువాల నిండా ఈ పనికిరాని పాతబట్టలే. తీసేస్తే బోలెడు ప్లేసొస్తుంది" అంది శ్యామల.

"నాకూ అదే ఇబ్బంది. ఇంట్లో చీర కొనుక్కున్నప్పుడల్లా ఎన్ని బీరువాలూ సరిపోవు, ఏమిటా చీరల పిచ్చి? అంటూ ఎగతాళి. సరే, రేపన్నీ సర్ది ఒక బ్యాగులోపెట్టు" అంది గిరిజ.

"ఒక బ్యాగేమిటి రెండు మూడు అవుతాయి"

"పోనీ అలాగే పెట్టు. నేను నా దగ్గరున్నవన్నీ సర్దుకుని సెంటరుకు బయల్దేరుతూ ఫోన్ చేస్తాను" అంది గిరిజ.

ఈ పాత బట్టలు ఇచ్చేయదగ్గవాళ్ళెవరూ దొరక్కపోవడం, వాటిని వదులుకోలేక, ఉంచుకుని ఏమీ చేసుకోలేకపోవడం గురించి వారు పదేపదే మాట్లాడుకున్నారు.

"మునుపు బోలెడంతమంది పేదవాళ్లుండేవారు. ఏదిచ్చినా తీసుకునేవారు. ఇప్పుడలా కాదు. పాచిపని చేసుకునేవాళ్లకూ ఫ్యాషన్లు... షోకులు" అంటూ శ్యామల తెగ బాధపడింది. గిరిజ ఆమెకు తాళం వేసింది.

+÷+++÷+

ఆ షాపులో అడుగుపెడుతుంటే, ఒక పాతికేళ్ల అమ్మాయి. "ఏం కావాలండీ?" అంటూ ఎదురొచ్చింది. గిరిజ విషయం వివరంగా చెప్పింది. ఒక పక్కగా మెత్తని పరుపులమీద కూర్చోబెట్టింది.

"బయటికి తియ్యమంటారా?" అంది శ్యామల.

"ఉండండి. మేం ఎలా తీసుకుంటామో చెప్పాక, అప్పుడు.. మీరు చీరలే కొనాలి. ప్రతిచీరకీ ఏభైశాతం మాత్రం పాత చీరల డబ్బు జమచేసుకుని, మిగిలినది క్యాష్ కట్టాలి.

"మా చీరలకు బదులుగా ఏమైనా తీసుకోవచ్చని చెప్పారే" అంది గిరిజ.

"అలా లేదండీ" అంది ఆ అమ్మాయి ఎంతో మర్యాదగా.

"పోనీ మా చీరల విలువెంతో అంత ఖరీదు చీరలే తీసుకుంటాం" అన్నారిద్దరూ.

"అదీ కుదరదండీ, సగం డబ్బుకట్టాలి"

"చీరలు చూద్దామా" అంది గిరిజ.

"చీరలెంతలో ఉన్నాయ్?"

"ఈ ఎక్చేంజీ చీరలు పదకొండువందల నుంచి మొదలు" అని ఒకటి రెండు చీరలు ముందుపడేసింది.

ఇద్దరూ చూశారు. ఆ చీరలు ఆరేడు వందల కంటే ఎక్కువ ఉండబోవని తెలిసిపోయింది. అసలుకు మించి ధరపెట్టి పిచ్చి చీరలు కొనుక్కోవాలని అర్థమైంది. ఇద్దరికీ ఒళ్లుమండిపోయింది. వాళ్లమీద వారికే కోపమొచ్చింది. వ్యాపారమంటే లాభసాటిగా ఉండేలా చూసుకుంటారు గానీ సమాజసేవ కాదని అర్థమైంది. ఇద్దరూ డబ్బులు పోసి చీరలు కొనుక్కునే ధ్యాసలో లేరు. ఒకప్పుడు పాతబట్టలతో స్టీలు సామాను కొని కొని విసిగిపోయారు. ఇంటి నిండా ఇప్పుడవి పేరుకుపోయి ఉన్నాయి. "ఈ బట్టల్ని ఎవరైనా పేదవాళ్లకు ఇచ్చేదాం" అంటూ బరువైన బ్యాగులు ఆటోలో వేసుకుని ఇంటి ముఖం పట్టారు. అనవసరంగా రెండొందలు ఆటోకు ఖర్చయినందుకు బాధకంటే వాటిని సవ్యంగా వినియోగించగల్గుతున్నందుకు మనసు తేలిపిగా అనిపించిందిద్దరికీ. *

ఇలా వుందామా...

వి. నాగరత్న

108



మా కాలనీలో అంతా పచ్చదనమే. చూడనివాళ్ళకి అతిశయోక్తిలా వుంటుందేమోగానీ నందనవనంలా రకరకాల పూలు దర్శనమిస్తాయి. గుత్తులుగుత్తులుగా ఉండే ఆ పూలనిచూస్తే ఆఫీసు మానేసి అక్కడే నిలబడిపోవాలనిపిస్తుంది. ఓరోజలాగే వాటిని చూసుకుంటూ నడుస్తోంటే ఓ ఇంటావిడ పెద్దపెట్టున అరవడం వినిపించి అటుగా చూశాను.

"నిన్ను చాలాసార్లు గమనించాను.. బుద్ధిలేదూ, మా చెట్ల పూలన్నీ కోసుకెళ్ళడానికి?" అని గదమాయించింది ఇంటావిడ.

"ఇందులో తప్పేం వుందమ్మా, ఏదో దొంగతనం చేసినట్లు కోపగించుకుంటున్నావు? దేవుడికోసం నాలుగు పూలు కోసుకుపోతా.. అంతేగా" అని బదులిచ్చింది మరో స్త్రీ.

"నీ కోసమేనా మేం చెట్లను పెంచుతోంది?"

"అయ్యో, మీరెలానూ కోసుకోరు.. ఎవరు పెడితేనేం దేవుడికేగా"

"ఇంకేం మాట్లాడకు.. పూలు చెట్లకుంటేనే అందం.. మా పిల్లలు కోసినా నేనూరుకోను"

"ఈమాత్రానికే అంత కోపం ఎందుకు తల్లీ? కాసిని పూలు కోసుకుంటే సంపదలే తరిగిపోయినట్లు?" అంది ఇవతలి స్త్రీ.

"చెప్తే అర్థంకాదా? నాకు పూలు పిల్లల్తో సమానం. వాటిని చూసి ఆనందించడమే తప్ప కోయడం నచ్చదు. మీరంతా ఇలాగే పూలు కోసేట్లయితే అసలు చెట్లే తీయించేస్తా" అని విసురుగా వెళ్ళిపోయింది ఇంటావిడ.

❖ ❖ ❖

సత్యం కంప్యూటర్స్ రామలింగరాజుగారు అంబులెన్స్ అవసరాన్ని గుర్తించి 108 టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రవేశపెట్టారు. దేశంలో ఎవరు, ఎక్కణ్ణించయినా ఈ నంబరుకు చేసి, తమ చిరునామాను చెప్తే చాలు ఆఘమేఘాలమీద అంబులెన్స్ వస్తుంది. ఇది నిజంగా మహత్తరమైన అవకాశం.

చిన్నచిన్న ఆసుపత్రుల్లో అంబులెన్స్ సౌకర్యం వుండదు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వుంటుందిగానీ సామాన్య ప్రజానీకానికి అందుబాటులో వుండదు. వాళ్ళు చెప్పే అమౌంటు వినగానే పేషెంటు సంబంధీకులకు కళ్ళు తిరిగే మాట నిజం. ఆటో కాకుండా అంబులెన్స్ అంటున్నామంటేనే అత్యవసర స్థితి అని కదా. అందుకే అప్పోసప్పో చేసైనా వాళ్ళు చెప్పిన మూల్యం చెల్లించక తప్పదు.

మరి అలాంటి ఆపత్సమయాల్లో ఆదుకుంటోన్న 108ను దుర్వినియోగం చేస్తోన్న ఘనులున్నారని సత్యం సంస్థవాళ్ళు చెబుతున్నారు. 'ఇది నిజమా, కాదా? ఫోన్ చేస్తే వస్తారా, రారా?' అనే కుతూహలంతో కొందరు ఫోన్‌చేసి, అంబులెన్స్ పంపమని అడుగుతున్నారట. తీరా వెళ్తే అక్కడ అలాంటి కేసులేం వుండక, వెనక్కెళ్తోన్న సందర్భాలనేకం వున్నాయంటున్నారు. ఇదెంతో అన్యాయం కాదూ? దీనివల్ల నిజంగా వాహనం అవసరమైనవాళ్ళకి సమయానికి రాదు. పైగా ఇలాంటి ఫాల్స్ కాల్స్ వల్ల లైన్లు బిజీగా వుండి ప్రాణాపాయస్థితిలో వున్నవారికి ఫోన్ కలవని ప్రమాదమూ వుంది. ఉన్న వాహనాలు సరిపోక, మరిన్ని కొనుగోలు చేయాలనే సదాలోచన చేస్తోన్న సదరు సంస్థకు ఇలాంటి తల్నొప్పులు తెచ్చిపెట్టి విసిగిస్తే ఆ సేవను విరమించుకునే ప్రమాదమూ కలగొచ్చు.

❖ ❖ ❖

మన అవసరాలు తీరడానికి కొన్ని సౌకర్యాలుంటాయి. వాటిని అవసరానికే వాడుకుంటే ఎవరూ తప్పుపట్టరు. కానీ వుందికదాని దుర్వినియోగం చేస్తేనే తంటా. అది అసలే లేకుండా పోయే ప్రమాదముంది. అంతవరకూ తెచ్చుకునేకంటే ముందుగానే జాగ్రత్తపడలేమా?!

*



సీరియల్

గొల్లపూడి నారాయణరావు

జరిగిన కథ

కోదండరాంరెడ్డి పత్రికలో అల్లుడి వార్తొచ్చిందని చెప్పగా అఖిలాండం గబగబా పత్రిక తీసుకుంది. మొదటి పేజీలోనే వార్తతోబాటు ప్రతాప్‌రెడ్డి ఫొటో కనిపించడంతో మురిసి పోయింది. సైనిక దుస్తుల్లో, చేత తుపాకీ ధరించిన భర్తను కన్నార్పకుండా చూస్తోంది.

(34వ భాగం)

తెలుగుగడ్డ

"ఆ వార్త చదువమ్మా" అన్నాడు. కోదండరాంరెడ్డి. అఖిలాండం చదవడానికి ఉపక్రమించింది.

"కొండపాడులో రజాకారుల దుర్నీతికి అడ్డుపడి ప్రజల మానప్రాణాలు కాపాడిన సంగం నాయకుడు ప్రతాప్‌రెడ్డి....." అని చదువుతోంది.

మధ్యనే రంగనాయకమ్మ కలిగించుకుని "ఇక చాల్లే మీ ఆయన ప్రతాపం చదువనక్కర్లేదు" అంటూ మూతి తిప్పింది.

"నీవు కాస్త ఆగవే, ఆ వార్త ఏమిటోవిందాం" అన్నాడు కోదండరాంరెడ్డి.

"ఏమిటీ వినేది? అక్కడెక్కడో పేరు పెంపులేని పనులు చేస్తున్నాడు. అంతమాత్రం మన ఊరు కనిపెట్టుకుని ఉంటే ఈ గందరగోళాలన్నీ ఎందుకు జరుగుతాయి? నా పెట్టెడు నగలు ఎందుకు పోతాయి?" అంది రంగనాయకమ్మ.

"చాల్లే, ఒట్టి స్వార్థపు మనిషివి" అన్నాడాయన విసుక్కుంటూ.

"కాకపోతే మరేమిటి? దేశంకాని దేశంపోయి ముఖం ఎరుగనివాళ్లకు ఈయన సహాయాలు చేయడం ఏమిటీ?"

"ఛీ... ఛీ... నీ బుద్ధి పోనిచ్చావు గాదు"

"ఏమిటయ్యా నీవు? ఇప్పుడు నా బుద్ధి కేమయిందంటావు?"

"ఏమయిందా? నీ ముఖం అయింది. అల్లుణ్ణి నువ్వెంత చీదరించుకుంటున్నావో బయటివాళ్లు అంతగా మెచ్చుకుంటున్నారు"

"ఆ మెచ్చుకోడాలు కూడా విన్నానులే. మన అల్లుడయ్యవల్లే ఊరంతా ఆరిపోయిందని అనుకుంటున్నారు"

"ఒకరిద్దరు అనుకోగానే సరా? దేశమంతా అనుకోవద్దూ? ప్రతాప్ అంటే పక్క ఊళ్లో వారందరూ గొప్ప అభిమానం చూపిస్తున్నారట. కొండజిల్లాల్లో నయితే అతణ్ణి మరీ దేవుడిగా పూజిస్తారని తెలిసింది"

"చాల్లే, ఆయన వెలిగింపు, ఎక్కడో, ఎవరికో దేవుడయితే సరిపోయిందీ, చేసుకున్న పెళ్లాన్ని ఇంటిదగ్గర వదిలిపెట్టి దేశాలు తిరగగానే పెద్దరికం వచ్చిందీ?"

"నోర్ముయ్యవే ముదనష్టపుదానా"

"మూసిననాళ్లూ మూశాను"

"ఇకనుండి నోరు తెరుచుకుని కూర్చుంటానంటావా?"

ఈ విధంగా సాగుతున్న తల్లిదండ్రుల సంభాషణను తెల్లమొగం వేసి వింటూ నిల్చుంది అఖిలాండం. చివరికి కలిగించుకుని "నాన్నా అమ్మతో నీకెందుకూ? తను ఒట్టి అమాయకురాలు" అంది.

దాంతో రంగనాయకమ్మ చర్రుమని లేచింది. "నేను అమాయకురాలినేలేవే. నీవూ మీ ఆయనా మీ నాన్న ముగ్గురూ గొప్ప తెలివిగలవాళ్లయితే చాల్లే" అంది అక్కడినుంచి కోపంతో వెళ్లిపోయింది.

ఆమె అలా వెళ్లిపోవడంతో తండ్రీకూతుర్లిద్దరూ నవ్వుకున్నారు.

"మీ అమ్మ ఒట్టి చాదస్తపు మనిషి. మొదటినుండి ఇంతేనమ్మా" అన్నాడు కోదండరాంరెడ్డి.

"పోనీలే నాన్నా, అమ్మతో ఇంతకాలం జరిగిపోయిందిగదా? ఇకమీదట జరగదంటావా?" అంది అఖిలాండం.

కూతురి మాటలకు అతడు లోలోపల ఎంతో సంతోషపడ్డాడు. ఆమె తలపై చేయివేసి నిమిరాడు.

"అమ్మా అఖిలమ్మా, నువ్వెంతో తెలివిగలదానవమ్మా! మీ అమ్మకోరినా, నేను కోరినా నీ సుఖమేనమ్మా, నీసుఖం కోరి నిన్ను ఒకరి ఇంటికి ఇవ్వదల్చుకోలేదు, ఒకళ్లను తెచ్చి మన ఇంట్లోనే పెట్టుకున్నాం. కానీ మా ఊహలన్నీ తల్లకిందులయిపోయాయి తల్లీ. ఇప్పుడు ప్రతాప్ నడిసముద్రంలో ఉన్నాడు..." అని అంటుండగానే అతని కళ్ల వెంట నీరు తిరిగి కూతురు నెత్తిపైపడ్డాయి. ఆమె తలెత్తి తండ్రి వంకకు చూసింది. నవ్వుతూ తన దగ్గరికి వచ్చిన తండ్రి అప్పటికప్పుడే కంటనీరు పెట్టడం చూసి అయోమయంలో పడిపోయింది.

"ఏమిటి నాన్నా ఏడుస్తున్నావు?" అంది.

అతడు గబగబా కండువాతో కన్నీరు తుడుచుకున్నాడు. "ఏమీలేదమ్మా" అంటూ అక్కడినుంచి బయటికి వెళ్లిపోయాడు. వెళ్లిపోతున్న తండ్రివంకే చూస్తూ కూర్చుంది.

అంతలోనే ఏసురత్నం వచ్చాడు. "చిన్నమ్మగారూ, గొడ్డలి కాస్తతెచ్చి అందీయండమ్మా. పొయ్యి కిందికి పేళ్లులేవని పెద్దమ్మగారు కేకలేస్తున్నారు" అన్నాడు. అఖిలాండం లేచిపోయి గొడ్డలి తీసుకుని వచ్చింది. దాన్ని అతడికందిస్తూ "వెధవ గొడ్డలి, మనిషి మోతబరువుంది" అంది.

ఏసురత్నం నవ్వాడు"గొడ్డలి ఈ మాత్రం బరువులేకపోతే ఎట్లా చిన్నమ్మగారూ? పేళ్లు పగిలిరావద్దూ?" అన్నాడు. గొడ్డలి చేతికి తీసుకుని వాయివైపుకు చూశాడు. "వాయి అంతా మణగిపోయింది. రేపే సవరించుకుని రావలసి వచ్చేట్లుంది"

అన్నాడు. గొడ్డలి ఎత్తుకుని మట్టెపుల్లల మండెవైపుకు నడిచాడు. అఖిలాండం తీరిగ్గా కూర్చుని పత్రిక తెరిచింది.

✿ ✿ ✿

మరునాడు ఉదయం బారెడు పొద్దెక్కింది. రంగనాయకమ్మ పొయ్యిరాజేసి ఎసరు పెట్టింది. బియ్యంలో రాళ్లు ఏరుతోంది. 'అయ్యో నా మతిమరుపు మండా! పాలేళ్లు పోయేటప్పుడు మరిచేపోయేను' అనుకుంటుంది.

"ఏమిటమ్మా మర్చిపోయాననుకుంటున్నావు?" అంటూ అఖిలాండం అక్కడికొచ్చింది.

"ఈ పూటకు కూర ఏమీ లేదమ్మా. నాలుగు వంగపిందెలుకోసుకు రమ్మందామని అనుకున్నాను. అంతలోనే వాళ్లకుచెప్పడం మర్చిపోయాను"

"నేను వెళ్లి కోసుకొస్తాలే"

"ఒంటరిగా పోగలవంటే అసలే రోజులు బాగాలేవు"

"మన తోట వద్దకు వెళ్లిరావడానికి భయమేమిటే. పెరళ్లదోవన ఎంతలో వెళ్లివస్తాను"

"సరే వెళ్లు. గుప్పెడు పచ్చిమిరపకాయలుకూడా పట్టుకురా"

తర్వాత అఖిలాండం సందుదోవనబడి పల్లపుచేల తోవపట్టింది. బాటకు రెండుపక్కలా నీలిమకాంతిని ప్రసరింపజేస్తున్న జొన్నచేలు రెండు నిలువుల ఎత్తున పెరిగి మనోహరంగా కనిపిస్తున్నాయి. తోవలో అల్లిబిల్లిగా అల్లుకుని వచ్చిన దోసతీగ కాళ్లకు చుట్టుకుంటోంది. పిల్లగాలి మందలింపులకు ముందుపడిన ముంగురులను చేత్తోపైకి సరిదిద్దుకుంటూ ఆమె ముందుకు నడవసాగింది. గూబల చింతను సమీపించింది. కాళ్లుపైకి, తలలుకిందకుపెట్టి తల్లకిందులుగా వేలాడుతున్న కబోదిపక్షులవైపుకు చూస్తోంది. ఆమె దృష్టి హఠాత్తుగా చింతచెట్టు మొదట్లో పడుకున్న వ్యక్తిపై పడింది. వెంటనే నిలబడిపోయింది. ఆ వ్యక్తివైపు పరీక్షగా చూసింది. ఆమె మనస్సు ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలతో నిండిపోయింది. చింతచెట్టు కింద పెరిగిన తంగేళ్లమొక్కతుప్పల్లోగుండా గబగబా వెళ్లి నిద్రపోతున్న వ్యక్తిపై చేయివేసి కదిపింది.

"ఏమండి" అని పిలిచింది. చివరకాతడు ఒళ్లువిరుచుకుంటూ లేచి కూర్చున్నాడు. ఎదురుగా ఉన్న ఆమెను చూశాడు.

ఆమె నవ్వింది "మీరిక్కడికెలా వచ్చారు? ముందు చెప్పండి" అంటూ అతడి సమీపంలో కూర్చుంది.

"మన గ్రామాన్ని రజాకార్లు, మిల్టరీ వచ్చి దోపిడీ చేసి వెళ్లారని తెలిసిబయలుదేరాను. నిన్న పగలంతా జొన్నచేల్లో అడ్డంగాబడి నడకసాగించాను. రైలుకట్ట దాటుతుండగానే గాఢాంధకారమైన చీకటి ఆవరించుకుంది. ఎట్లాగయినా ఇంటికి చేరుకుందామనే పట్టుదలతో ఇంతవరకు నెట్టుకొచ్చాను. కాని ఇక్కడికి వచ్చేసరికి అడుగుముందుకు పడలేదు. నడవలేకపోయాను. మన గ్రామందాటి వచ్చానేమోననే ఆలోచన కలిగింది. వెంటనే చింతకింద పడుకున్నాను. పడుకోగానే గాఢమైన నిద్రపట్టింది. ఇప్పుడే నీవు లేపితేనే నిద్రమెలుకువ వచ్చింది. కానీ ఇప్పుడు నేనెక్కడ ఉన్నాను. ఈ జొన్నచేలు మన గ్రామంవేనా?" అనడిగాడు.

ఆమె మరింతగా నవ్వింది. "కాస్త లేచి చూడండి. మీరు పడుకున్నది గూబల చింతగాదూ? ఆ కనిపించేది మన పల్లపుచేలోకి వెళ్లేబాటగాదూ? ఆ బాటన నేను తోటలోకి వెళ్తుంటేనే మీరు కనిపించారు" అంది.

అతడు నివ్వెరపాటుతో లేచినిల్చుని నలుదిశలా పరికించాడు."నిజమే అఖిలా, ఊరు ముందుకొచ్చి గూడా ఊరు తెల్సుకోలేకపోయాను" అన్నాడు.

ఆమె లేచి నిల్చుంది. "సరేలే మంచివారే మన ఊరిపొలాలే తెల్సుకోలేకపోయారు? నిన్న పగలంతా నడవడంతో సరిపోయిందంటున్నారు. రాత్రి భోజనం లేదనే తెలుతోంది. మరి నిన్న ఉదయం ఎక్కడ భోంచేశారు?" అందామె భర్త కళ్లల్లోకి చూస్తూ. అతడు నవ్వాడు "జొన్న చేలలో భోంచేశాను" అన్నాడు.

"చేలలో భోంచేయడం ఏమిటి?" అందామె.

అతడామెను దగ్గరికి తీసుకుని "పిచ్చిదానా" అన్నాడు. ఆమె నొసటిపై ముద్దుపెట్టుకున్నాడు. "జొన్నచేల నిండా దోసకాయలు, పెసరకాయలు లేవూ? అవి ఏరుకుని కడుపునిండా తిన్నాను" అన్నాడు.

"అయితే మీరు రోజూ అన్నం తినడం లేదూ" అనడిగిందామె.

"అన్నం తినకపోవడం ఏమిటి? నిన్న ఒక్కరోజు మాత్రం చేలల్లో దొరికిన వాటితో ఆకలి తీర్చుకున్నాను"

"కాదులెండి మీ ముఖం పీక్కుని పోయి కనిపించడంలేదూ? మీరు అప్పటికంటే చాలా చిక్కిపోయారు గూడా. నిజం చెప్పండి నామీద ఒట్టు వేసుకుని మరీ చెప్పండి ప్రతిరోజూ వేళకు అన్నం తింటున్నారా? లేదా?"

అతడు నవ్వాడు "అఖిలా,సరైన వేళకు తిండితిప్పలు దొరకాలీ అంటే ప్రతిఊళ్లో మనకు స్వంత ఇళ్లున్నాయా? ఇవ్వాళ ఈ గ్రామం అయితే రేపటికింకో గ్రామం చేరుకంటూంటిమి" అన్నాడు.

అంతలోనే ఆమె కంటినిండా నీరు పెట్టింది. అతడి భుజం మీద తలవాల్చి వెక్కివెక్కి పడుతోంది.

"ఛీ ఏడుస్తున్నావా అఖిలా? అన్నాడాతడు. ఆమె తలను పైకెత్తి కంటి నీరు తుడిచాడు. "తప్పుగాదూ? ఎందుకేడవడం?" అన్నాడు తిరిగి.

"మీ మాటలు వింటుంటే, మిమ్మల్ని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. మీ కడుపు చూసుకోండి, వెన్నుకంటుకుపోయింది. ఎదురు రొమ్ముపై ఎముకలన్నీ బయటపడ్డాయి" అందామె.

"అదిసరేగానీ అఖిలా, మరి నీవెందుకు చిక్కిపోయావు చెప్పూ?" అన్నాడతను,

"నేను చిక్కిపోయానా?"

"చిక్కిపోలేదు మరీ అప్పుడు నీ బుగ్గలు ఎలా ఉండేవి? ఉబ్బుగా , నున్నగా నిగనిగమెరుస్తూండేవి. ఇప్పుడేమో గుంటలుపడి లోనికి పీక్కుపోయాయి" అన్నాడతను.

ఆ మాటలకామె కిలకిలా నవ్వింది.అతడూ నవ్వాడు.

"ఇక ఇంటికెళ్దాం పదండి" అందామె.

అతడు చింత మొదట్లో ఉన్న సంచీచేతికి తీసుకున్నాడు. భర్తకనిపించిన సంతోషంలో ఆమె వంకాయలు తీసుకురావాలనే మాటే మరిచిపోయింది. ఇద్దరూ కలిసి పెరళ్లతోవన ఇంటికిబయల్దేరారు.

✿ ✿ ✿

అల్లుడు ఇంటికి రావడంతో రంగనాయకమ్మ ముఖం విప్పారింది. అతడి ముఖమెదుటపడి మాట్లాడలేకపోయినప్పటికీ చేసే పనుల్లో ఎంతోఉత్సాహం, ఆప్యాయతా కనపరచింది. అప్పటికప్పుడే మంగలిని పిలిపించి అల్లుడికి క్షౌరం చేయాలని పురమాయించింది. సున్నితో నలుగుపెట్టించి తలారా స్నానం చేయించింది. కోవటింటి నుండి కొత్తబట్టలు తెప్పించి కట్టబెట్టింది. ఆ పూటకుపిండి వంటలతో భోజనం తయారు చేయించింది.

అఖిలాండం కొసరికొసరి వడ్డిస్తుంటే ప్రతాప్‌రెడ్డి కొంతతిని కొంత వదిలేశాడు. చేతులు కడుక్కుని లేచి గదిలోకి వెళ్లిపోయాడు. కాస్సేపటికి అఖిలాండం కూడా భర్త ఉన్న గదిలోకి వచ్చింది.

"భోంచేశావా అఖిలా" అన్నాడతను

ఆమె తలూపింది.

అతడామె చేయి పట్టుకుని పక్కన కూర్చోబెట్టుకున్నాడు. "అఖిలా విశేషాలేమిటి?" అనడిగాడు,

ఈ మధ్య జరిగిన హడావుడినంతా ఆమె అతడికి చెప్పింది. తన నగలు, తల్లి నగలు అన్నీ రజాకారులెత్తుకుని పోయారని చెప్తున్న సమయంలో ఆమె కంటి నిండా నీరుపెట్టింది. చివరకు "ఇదంతా మీవల్లనే జరిగిందని ఊరంతా ఆడిపోసుకుంటున్నారట" అందామె.

(ఇంకా వుంది)

ఇంటి పేరేది?!

మనదేశంలో ఇంటిపేరుకు చాలా ప్రాముఖ్యం వుంది. పొడి అక్షరాల్లో చెప్తే చాలా మందికి నచ్చక మొత్తం చెప్పించుకుని విని తృప్తిపడతారు. అదే ఆడపిల్లయితే 'అత్తగారింటిపేరేంటి?' అనడుగుతారు నిర్మొహమాటంగా. 'పుట్టిందగ్గర్నుంచీ వున్నదాన్ని ఎందుకు మార్చుకోవాలని' ఏ అమ్మాయయినా ధైర్యంచేసి అడిగిందో ఐపోయిందే. క్లాసులు తప్పవు. ఇకపై ఆ బాధలు వుండవు లెమ్మంటున్నారు ఇటలీ స్త్రీ పార్లమెంట్ సభ్యులు. ఈ విషయమై ఈ నెలలో 13 బిల్లులు ఆమోదముద్ర వేసుకోనున్నాయి. అప్పుడిక ఆడపిల్లకి పుట్టింటి పేరా, అత్తింటిపేరా అనే సమస్యే లేదు. కొత్తగా పుట్టబోయే పిల్లలకు ఆడపిల్లయితే తల్లి ఇంటిపేరు రావాలని, మగపిల్లాడైతే తండ్రి ఇంటిపేరు రావాలని చట్టం చేయనున్నారు. ఇదెంత అభ్యుదయ పరిణామం కదూ?! కొన్నేళ్ళు పట్టినా మొత్తానికి మనదేశంలోనూ అమలవుతుందిలెండి!

క్యాంపస్ ఛాట్

కె శివలీల

టిట్ ఫర్ టాట్

"నమస్కారమండీ..." ఓ యువకుడు ఎదురుగా నిల్చుని, రెండుచేతులూ జోడించి వ్యంగ్యంగా అన్నాడు.

"ఓ.,. మీరా? ఇక్కడ ప్రత్యక్షమయ్యారేంటి? భలేవారే... ఒట్టి నమస్కారంతో సరిపెట్టేస్తున్నారు. సాష్టాంగ నమస్కారం చేయాలిగా...మర్చిపోయారా?" చిలిపిగా మాట్లాడుతూనే, చురక అంటించిందా అమ్మాయి. వారిద్దరూ ఒకరికొకరు అపరిచితులు!

ఆ డోసు అతనికి సరిపోయినట్లు లేదు. బైక్ మీద బైఠాయించి, ఆమెకోసం కాపుకాశాడు. ఆమె తిరిగి వస్తుంటే... "ఏంటి మేడం... నమస్కారమని చెబితే మరీ అంత దారుణంగా మాట్లాడారు... ఇంతకీ ఎక్కడికెళుతున్నారు... మనింటికేనా...." కొంటెగా అడిగాడు.

"కాదు... నిన్ను నిమజ్జనం చేయడానికి" షార్ప్‌గా సమాధానమిచ్చిందామె.

✪✪✪

ఇద్దరు స్నేహితులు చేతులు పట్టుకుని నడుస్తున్నారు. డివైడర్ దగ్గర ఆగారు. ఎక్కబోయేంతలో... వారి రెండు చేతులనూ విడదీయడానికి ప్రయత్నిస్తోందో బలమైన చేయి. ఎవరా అని చూడబోయేంతలో వారిద్దరి చేతులూ విడదీసింది. వారిరువురిని దూరంగా నెట్టింది. ఆ తర్వాతి క్షణంలో డివైడర్ ఎక్కి, వారిద్దరికీ అడ్డుగోడలా నిటారుగా నిల్చుంది ఆ చేయి తాలూకు శాల్తీ. వారి కోపం తారాస్థాయికి చేరింది. వారిరువురిలో ఒకమ్మాయి అస్సలు కంట్రోల్ చేసుకోలేకపోయింది. కసితీరా అతని వీపు మీద ఒక్కటిచ్చింది. అతను కోపంగా వెనక్కుతిరిగి చూశాడు. "హి...హి...హి..." అని పళ్లికిలించింది. అతని రియాక్షనేంటి? ఆమె గూబగుయ్ మనిపించాడా? అంతలేదు... డివైడర్ దిగి, రోడ్ క్రాస్ చేసి చక్కా వెళ్లిపోయాడు. వెనక్కి చూసే సాహసం చేయలేదు మరి.

✪✪✪

"రాజేష్.. నీకొకటి చెప్పనా... ట్యాంక్ బండ్‌నుంచి గమనిస్తున్నాం. మమ్మల్నొకడు ఫాలో అవుతున్నాడు. లిబర్టీ వరకూ వచ్చాడు. పెద్ద జిడ్డులా ఉన్నాడు. అస్సలు వదిలేలా లేడు. ఏంటీ... ప్రోసీడవ్వాలా... అంతలేదు బాబూ. అతనెవరో తెలుసా... ఓ అంకుల్. ఇప్పుడు మా ఎదురుగానే నిల్చున్నాడు. నువ్విప్పుడే ఇక్కడికొచ్చేయ్... ఆ... పేరడగాలా... ఎక్కడుంటాడో తెలుసుకోవాలా... అతణ్ణలా అవమానించకు. పాపం బాధపడతాడు. ఎందుకలా అవమానిస్తావ్ అతణ్ణి... అతను మూగవాడు తెలుసా... ఎందుకంటే... ఫాలో అవుతున్నాడేగానీ ఎటువంటి కామెంట్సూ చేయలేదు మరి. అతనికి చెవుడుందేమోనని ఇప్పుడిప్పుడే నాకు అనిపిస్తోంది. కారణమేంటంటే... నేను అతనికి వినిపించేట్లుగానే గట్టిగా మాట్లాడుతున్నా. అతనిలో రెస్పాన్సే లేదు. అంటే అర్థమేంటి చెప్పు......" ఇది ఓ అమ్మాయి ఫోన్ సంభాషణ. అందరూ వింటారన్న ఫీలింగ్ అస్సలే లేదు. పాపం ఆ శాల్తీ... ఆ అమ్మాయినుంచి దూరంగా వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత అక్కడ్నుంచి జారుకుంది. మరిక తిరిగి కనిపించలేదు. 'దిమ్మతిరిగిపోయినట్టుంది కదూ' అనుకుంటూ ఆ స్నేహితుల బృందం హాయిగా నవ్వుకుంది.

✪✪✪

వావ్... వాటే సీన్స్ యార్... అనుకుంటున్నారా? గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్యాంక్‌బండ్, లిబర్టీ, హిమాయత్ నగర్‌లలో చోటుచేసుకున్న సంఘటనలివి. "ఎవరైనా కామెంట్ చేస్తే... పట్టించుకోనట్లో... మౌనాన్నాశ్రయించో... తిట్టుకుంటూనో ఉండే అమ్మాయిల్నే చూశాంగానీ మరీ టిట్ ఫర్ టాట్‌లా చేస్తున్నారేంటి... బాబోయ్... మరీ ఇంత స్పీడైతే తట్టుకోవడం కష్టమే" అనుకుంటున్నారా? ట్యాంక్‌బండ్ దగ్గర గణేష్ నిమజ్జనం చూడ్డానికొచ్చిన ఓ అబ్బాయి ఇలానే అనుకోబోయి పైకే అనేశాడు. ఇంతగా ఎందుకు స్పందించాడు? ఎందుకంటే అతనికెదురైన అనుభవం అలాంటిది మరి. ఇంతకీ అతనేం చేశాడంటే...

కేకలు... అరుపులు... బ్యాండ్ మోతలతో ట్యాంక్‌బండ్ చాలా సందడిగా ఉంది. ఎవడిగోల వాడిది. ఒకర్నొకరు పట్టించుకునే సూచనలే లేవు. ఇద్దరమ్మాయిలు గణేష్ విగ్రహాలను చూస్తూ నిల్చున్నారు. ఓ అబ్బాయి వారి వెనకే ఉన్నాడు. వారినే గమనిస్తున్నాడు. 'ఇంత జనంలో నన్నేం చేయగలరు' అనుకున్నాడు కాబోలు ఒకమ్మాయి భుజంపై చేయివేశాడు. ఏమీ ఎరుగనట్లు అటూ ఇటూ చూస్తున్నాడు. ఆమె అనీజీగా కదిలింది. 'ఏంటే నీ చేయింత బరువుగా ఉంది?' అనడిగింది పక్కనున్న స్నేహితురాలిని. 'నా చేయి బరువుగా ఉండడమేంటి' ఆశ్చర్యపోయిందా స్నేహితురాలు. 'అంటే అది నీ చేయి కాదా? మరిప్పుడేం చేయమంటావ్...' రహస్యంగా అడిగింది. 'థర్డ్ డిగ్రీ ప్రయోగించు... ఆలస్యమెందుకు' అల్లరిగా నవ్వుతూ సూచించిందా స్నేహితురాలు. ఆ మాట విన్నదే తడవుగా... తన భుజంపై ఉన్న ఆ చేతిని కసితీరా గట్టిగా గిచ్చేసిందా అమ్మాయి. అతని బాధాభరితమైన కేక ఆ జన కోలాహలంలో కలిసిపోయింది.

"ట్యాంక్‌బండ్ మీదుగా నడుస్తున్నాం. గణేష్‌ను తీసుకెళ్తున్న లారీ మాకు సమాంతరంగా వచ్చింది. దానిపై కూర్చున్నవారు మాపై పూలు జల్లుతున్నారు. అవి బంతిపూలు... తలపై టప్.. టప్‌మని తగులుతున్నాయ్. పూలలా లేవు... రాళ్లలా ఉన్నాయి. నవ్వాలో ఏడ్వాలో అర్థంకాని పరిస్థితి. దూరంగా వెళ్లడానికి ప్రయత్నిస్తున్న కొద్దీ వారు గురిచూసి మరీ మాపైనే విసురుతున్నారు. ఆ లారీతో పాటే మేమూ నడవాలి. మా మొహాలు ఆముదం తాగినట్లుగా అయిపోయాయి. మమ్మల్ని చూసి వారు గొల్లుమని నవ్వుతున్నారు. మరిన్ని పూలు రువ్వుతున్నారు. 'వీళ్లకు అంత ఎంటర్‌టైన్‌మెంటా... ఇలా అయితే కుదరదు. షటిల్ ఆడాల్సిందే...' అనుకున్నాం. ఆ తర్వాత మాపై వేస్తున్న పువ్వులు మమ్మల్ని తాకకముందే వాటిని చేతులతో కొట్టేస్తున్నాం... వాళ్లేం తక్కువ తిన్నారా? ఇలా అయితే వర్కవుట్ కాదనుకున్నారు కాబోలు... పువ్వులు విడదీసి, వాటిని జల్లడం మొదలెట్టారు... పూలు విసరడంతో పోల్చితే ఇదే బెటర్... ఇలాంటి సమయాల్లో మనం వీటన్నింటికీ ఫీలవ్వకూడదు. జస్ట్ టేకిటీజీ..." అంటోందా అమ్మాయి. మరి మీరేమంటారు?

*

జమున... నటన అంటే ఏమిటో కూడా తెలియని స్కూల్ రోజుల్లో నాటకాలాడి బహుమతులను సొంతం చేసుకుంది. సినిమాల్లో రాణించి తనదైన ప్రతిభను చాటుకుంది. ఆవిడ తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో దాదాపు 180 చిత్రాల్లో నటించారు. రాజకీయాల్లోనూ రాణించి ప్రస్తుతం బంజారాహిల్స్‌లో ప్రశాంత జీవనం గడపడానికే ఇష్టపడుతున్న ఆమెను కదిలిస్తే ఎన్నో జ్ఞాపకాలు, అనుభవాలు...

చందు

విషాద సంఘటన

నేను 1936 ఆగస్టు 30న చారిత్రాత్మక ప్రదేశం, విజయనగర సామ్రాజ్య ముఖ్య పట్టణమైన 'హంపి'లో పుట్టాను. నా మాతృభాష కన్నడం అయినా తెలుగు అమ్మాయిగానే మొదట్నుంచీ చలామణి అవుతున్నాను. అమ్మ కౌసల్యాదేవి. సంగీత విద్వాంసురాలు. నాన్న శ్రీనివాసరావుగారు బాగా చదువుకుని కూడా పరిస్థితుల ననుసరించి వ్యాపారరంగంలోకి ప్రవేశించాల్సి వచ్చింది. పసితనంనుంచీ కుక్కపిల్లలు, పిల్లులు మొదలైన జంతువులంటే మహా ఇష్టం. కాస్త నడక వస్తూండగానే ఎవరింట్లో కుక్కపిల్ల కనిపించినా పరుగెత్తుకుని వెళ్ళేదాన్నట. సంక్రాంతి ముగ్గుల్లో పసుపుకుంకుమలతో అలంకరించిన గొబ్బెమ్మలను పెట్టేదాన్ని. చిన్నతనంలో ఆఖరి తమ్ముడు చనిపోయిన సంఘటన నా హృదయంలో చెరగని ముద్రవేసింది. వాడిని నాన్న, నలుగురు పెద్దలు తీసుకుని పోతుంటే 'మా తమ్ముణ్ణి ఎక్కడికి తీసుకుపోతున్నా'రంటూ మరో తమ్ముడు గిరిధర్‌తో కలిసి వాళ్ళ వెంటపడ్డాం. 'మీ తమ్ముడికి జబ్బుచేసింది. ఆస్పత్రికి తీసికెళ్తున్నా'రని అక్కడున్న ఆడవాళ్ళు మమ్మల్ని గట్టిగా పట్టుకుని సముదాయించారు. మేం నిజమే అనుకుని ఏడుపు మానేశాం. నాలుగైదురోజుల తర్వాత ఒకమ్మాయి 'మీ తమ్ముడు చనిపోయాడు. స్మశానంలో పాతిపెట్టారు. కావలిస్తే వెళ్ళి చూడండి. అక్కడ మీ తమ్ముడి చొక్కా ఉంటుంది' అని చెప్పగానే స్మశానంవైపు బయల్దేరాం. దార్లో నీళ్ళకు వెళ్ళే ఆడవాళ్ళు మమ్మల్ని చూసి, మా ధోరణి అర్థం చేసుకుని మీతో చెప్పిందంతా అబద్ధం అంటూ బలవంతంగా ఇంటికి తీసుకొచ్చి అమ్మకు అప్పజెప్పారు. చిన్ననాటి అనుబంధాన్ని గాయపరచిన ఆ సంఘటనను కాలమే క్రమంగా మరిపించగలిగింది.

కోప్పడేసరికి ఏడుపు మొహం పెట్టాను

నా బాల్య జీవితం, చదువుసంధ్యలు, ఆటపాటల్లోని ఉత్సాహకరమైన ఘట్టాలు ఎక్కువగా దుగ్గిరాలలోనే జరిగాయి. ఒకసారి తెనాలి దగ్గర పెమగుదురుపాడు గ్రామంలో ఆ జిల్లాలోని అన్ని పాఠశాలలూ పాల్గొనేలా నాటకాలు, ఆటపాటల పోటీలు ఏర్పాటుచేశారు. 'ఇప్పుడు దుగ్గిరాల స్కూలమ్మాయి బేబి జమున పాటపాడుతుంది' అని ప్రకటించారు. కాగితంతో చేసిన పావురాన్ని ఎడం చేత్తో పట్టుకుని 'స్వర్గసీమ'లో భానుమతిగారు పాడిన "ఓహో... పావురమా' అంటూ పాట ప్రారంభించి, ఆ పాటకు తగినట్లుగా అభినయించసాగాను. పాట మధ్యలో ఒకచోట 'నా వలపు కౌగిలిలో ఓలలాడరావే' అని పాడేసరికి ప్రేక్షకులు గొల్లున నవ్వుతూ చప్పట్లు కొట్టారు. నేను పాడిన ఆ లైనుకు క్లాప్స్ కొట్టేసరికి వాళ్ళకి బాగా నచ్చి ఉంటుందని, బాగా నటించానని మెచ్చుకుంటున్నారనుకుని ఆ చరణాన్ని మళ్ళీ పాడాను. ఈసారింకా పెద్దగా అరుస్తూ అల్లరి చేశారు. పాట పూర్తవ్వగానే మా టీచరొచ్చి 'ఎందుకు ఇలాంటి పాటపాడావ'ని కోప్పడ్డారు. 'నేనేం చేశాను? వూరికినే తిడతారు' అంటూ ఏడుపు మొహం పెట్టాను. మరో టీచర్ 'లేదమ్మా ఏడవక'ంటూ బుజ్జగించారు. 'ఆ పాట అర్థం నీకు తెలీదు. అలాంటి పాటలు స్టేజీమీద పాడకూడదు. ఇంకెప్పుడూ అలా పాడకు' అని సముదాయించారు. జరిగిన అవమానాన్ని సహించలేక పోయాను. ఎవరైతే నన్ను ఎగతాళి చేశారో వారిచేతనే 'బాగా నటించింది' అనిపించుకోవాలన్న పట్టుదల నాలో మొలకెత్తింది. వెంటనే మా మాస్టారుగారి దగ్గరకు వెళ్ళి పాడేందుకు మరో ఛాన్స్ ఇవ్వమని కోరాను. ప్రోగ్రాం ఆఖర్లో నాకా అవకాశం ఇచ్చారు. ఈసారి రెండు చేతులనిండా పువ్వులతో భారతమాతపైన స్వాగతగీతం ఆలపిస్తూ అభినయించాను. ప్రేక్షకులు నిశ్శబ్దంగా కూర్చుని పాట విని పూర్తవ్వగానే కరతాళధ్వనులతో అభినందించారు. తర్వాత చాలాసేపు కొందరు పిల్లలు, టీచర్లు కార్యక్రమాల గురించి చర్చించుకోసాగారు. ఈసారి మన స్కూలుకు పెద్దగా బహుమతులు రావనీ, ఆటల్లో మాత్రం ఆ అమ్మాయి పుణ్యమా అంటూ తప్పకుండా ప్రథమ బహుమతి వస్తుందని, జమున మూలంగా డాన్సులు పాడయ్యాయని అనుకున్నారు. మరుసటిరోజు ఉదయం ఆ పాఠశాలలోనే బహుమతులు అందజేసే కార్యక్రమం ఏర్పాటుచేశారు. 'పాటల పోటీలో ప్రథమ బహుమతి జమున' అన్న ప్రకటన వచ్చింది. ఒక్కక్షణం మావాళ్లందరి మతులూ పోయాయి. మరి అంత అల్లరి జరిగిన తర్వాత కూడా ప్రైజ్ రావడం అంటే ఆశ్చర్యమేగా!

'కోడిగుడ్డు మొహం', 'గుడ్లగూబ' అన్నారు

స్కూల్ కార్యక్రమాలలోను, నాటకాల్లోను స్టేజి ఎక్కడం తప్పితే, బహిరంగంగా ఏ నాటకంలోనూ నటించలేదు. మావూరి నాటక సమాజం వారు 'ఢిల్లీ ఛలో' అనే సాంఘిక నాటకాన్ని ఉగాది రోజున వేయడానికి రిహార్సల్స్ చేస్తున్నారు. ఆ డ్రామాలో హీరో చెల్లెలి పాత్రలో నటించేందుకు నన్ను పిలుచుకుని వెళ్ళారు. మొదట్లో అమ్మ అభ్యంతరం చెప్పినా, వాళ్ళ బలవంతంపైన బహిరంగ నాటకంలో నటించడానికి ఒప్పుకుంది. ఆ నాటకంరోజు నుంచీ మా స్కూలు పిల్లలతో పోట్లాటలు ఎక్కువైపోయాయి. నాకు రకరకాల పేర్లు పెట్టారు. నేను సన్నగా, పొడుగ్గా ఉన్నానని 'నిక్కికొడవలి' అని, కోలముఖం కనుక 'కోడిగుడ్డు ముఖం' అని, పెద్ద కళ్ళు కనుక 'గుడ్లగూబ' అని ఎదురుగానే తిడుతూ, పోట్లాడేవారు.

నటనంటే ఏమీ తెలీదనిపించింది

కొన్నాళ్ళ తర్వాత సుంకర, వాసిరెడ్డిగార్లు రచించిన 'మా భూమి' నాటకంలో నటించే అవకాశం వచ్చింది. అందులో కూడా నేను కథానాయకుడి చెల్లెలిగానే నటించాను. 'ఢిల్లీ ఛలో'లో పాత్రకంటే 'మా భూమి'లో కమల పాత్ర ఎంతో బరువైంది. ఆ నాటకంతోనే నాకు 'నటన' అంటే ఏమిటో కొద్దిగా తెలిసింది.

జగ్గయ్యగారు అప్పటికి చలనచిత్ర రంగంలోకి ప్రవేశించలేదు. హైస్కూల్లో టీచర్‌గా ఉంటున్నారు. మా అమ్మానాన్నలతో ఆయనకు అంతకుముందే పరిచయముంది. ఓరోజు జగ్గయ్యగారు మాఇంటికొచ్చారు. 'ఈరోజు రాత్రి తెనాలిదగ్గర మండూరు గ్రామంలో 'ఖిల్జీ రాజ్య పతనం' అనే నాటకం వేస్తున్నాం. అందులో మీ అమ్మాయి చేత ఒక చిన్న డాన్స్ చేయించాలి. మీరు సరేనంటే మీ అమ్మాయిని తీసుకువెళ్దామని వచ్చాం...' అని జగ్గయ్యగారు అన్నారు. అమ్మ ఏ మూడ్‌లో ఉందోగానీ 'సరే...' అని వారితో పంపించింది. ఆ నాటకంలో జగ్గయ్యగారు పిచ్చివాడి వేషంలో నటించారు. అసలు నటన అంటే ఇది. నాకు నటన అంటే ఇంకా ఏమీ తెలియదు' అనిపించింది. నాటకాల్లో నా ఉత్సాహాన్ని చూసి, సంతోషించి 'ఇంత తెలివిగా, హుషారుగా ఉన్న అమ్మాయిని సినిమాల్లోకి ఎందుకు చేర్పించకూడదు?' అని కొందరు పెద్దలు అమ్మతో అన్నారు. 'ఆ... దాని మొహం.. దానికి సినిమాలేమిటండీ' అని నవ్వేసింది అమ్మ. ఆ రోజుల్లో సినిమాల్లో చేరాలనే అభిలాష లేకపోయినా, సినిమాలు విపరీతంగా చూసేదాన్ని.

(ఇంకా వుంది)

దారి కనిపెట్టగలరా!



బొమ్మలో ఇమడనివేవి?

బుజ్జాయిలూ... కింది బొమ్మ చూశారుగా. ఆర్టిస్టు అంకుల్ అడవిలో చూసిన సన్నివేశాన్ని చక్కగా గీశాడుకదూ. కాకపోతే అందులో ఇమడని బొమ్మలు పది వున్నాయి. మీరు వాటిని గుర్తించి పెన్సిల్‌తో సున్నా చుట్టండే.

ఎన్ని ఎద్దులు వున్నాయి?

పది తేడాలు గుర్తించండి

చిట్టి పొట్టి పిల్లలూ! కింద రెండు బొమ్మలున్నాయి. గబాల్న చూస్తే రెండూ ఒకేలా వుంటాయి. కాకపోతే పది తేడాలున్నాయి. మీరే వాటిని పసిగట్టాలి.

చూసి గియ్యండే!



రెండు పిల్లులకు ఒకేతోక

హేయ్ చిన్నారులూ... కింద 18 పిల్లులున్నాయి. ఆర్టిస్టు అంకుల్ ఓ చిలిపి పని చేశారు. అదేంటంటే... రెండు పిల్లులకు కలిపి ఒకటే తోక గీశారు. ఆ రెండు పిల్లులు ఏవో గుర్తించండి చూద్దాం.



రంగులు పులిమేద్దాం

ఎవరు దేన్ని పట్టారు?

నేస్తాలూ... ఈ నలుగురు మంచి ఫ్రెండ్స్. ఓ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. ఒక్కో గేలానికి ఒక్కోటి చిక్కుకుంది. ఎవరు దేన్ని పట్టుకున్నారో కనుక్కోండి చూద్దాం.



అట్టమీది కథ

కాట్రగడ్డ నర్సయ్య

అమెరికాలో జీవనం యువతరానికో సుందర స్వప్నం. అందమైన రంగుల జీవితం. ప్రతిభా పాటవాల గుర్తింపుకూ, ధనార్జనకూ ప్రధాన కేంద్రం. కాని అమెరికా సమాజానికి సంబంధించి ఇది ఒక పార్శ్వం మాత్రమే. దానికి ఉన్న చీకటి పార్శ్వం గురించి మనకు తెలిసింది, తెలిసేది చాలా తక్కువ మాత్రమే. నేను నాలుగుసార్లు అమెరికాలోని అనేక పట్టణాల్లో పర్యటించాను. ఇటీవల మార్చినుండి జూలై ఆఖరు వారం వరకు అక్కడ గడిపి వచ్చాను.

అమెరికా - ఆంధ్రులు

అమెరికాలో వివిధ జాతుల మధ్య జీవనంలో అంతరాలు చాలా స్పష్టంగా కనిపించే అంశం. మన దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి అమెరికా వలస వెళ్లినవారి సంఖ్య కోటి వరకు ఉంటుంది. అందులో తెలుగువారి సంఖ్య 9 నుండి 10 లక్షల వరకు ఉంటుంది. అమెరికన్ తెలుగువారు సాత్వికులు. ఎవరి పనులు వారు చేసుకొంటూ అక్కడి పరిస్థితులకనుగుణంగా మసులుకుంటారు.

1960 నుండి 90 వరకు అక్కడికి వలస వెళ్లిన మొదటి తరం వారు తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు అనుగుణంగానే నడిచేవారు. తర్వాతి కాలంలో వెళ్లినవారు హైటెక్ తరంవారు. కంప్యూటర్లు తెచ్చిన మార్పులు మనవారి జీవనంలోనేకాక ఆలోచనల్లో సైతం కనిపిస్తాయి. ఇప్పుడు అమెరికాలోని తెలుగు యువత మూడోతరానికి చెందింది. వారి ఆలోచనా సరళీ, ఆచార వ్యవహారాలూ మొదటి తరంవారిని తల్లడిల్లేలా చేస్తున్నాయి. వీరిలో భారతీయ విలువలపట్ల గౌరవాన్ని పెంపొందించే దిశగా తానా, ఆటా, బేటా సంస్థలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి.

అమెరికన్ల జీవనాన్ని మూడు రకాలుగా విశ్లేషించుకోవచ్చు.

1) దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదవారు. వీరిలో ఎక్కువమంది దొంగ వీసాలతో ఇతర దేశాలనుండి ప్రవేశించినవారుంటారు. వీరిని రెస్టారెంట్స్, శానిటేషన్ పనులకు వినియోగిస్తారు.

2) రెండో రకం మధ్యతరగతి మేధోజీవులు. వీరిలో కూడా వలస వచ్చిన వారున్నారు. వీరిలో ఎక్కువమంది శాస్త్రవేత్తలు, కంప్యూటర్ ఇంజనీర్లు, డాక్టర్లు, మెకానిక్‌లు, నిపుణులుగా పనిచేస్తున్నారు.

3) ఇక మూడో రకం వారు సంపన్నులు. అమెరికా ఆర్థిక, రాజకీయ వ్యవస్థను శాసిస్తూ దాన్ని తమకు అనుకూలంగా మలచుకోగల్గే కంపెనీల యజమాన్లు, పారిశ్రామికవేత్తలు ఈ కోవలోకి వస్తారు. వీరు డబ్బుతో పని చేయించుకుంటారు. వీరికి లాభాలే ముఖ్యం. ఖనిజ సంపద, వనరులు ఎక్కడ ఏ దేశంలో ఉన్నాయో, పెట్టుబడులపై లాభాలు ఎక్కడ వస్తాయో, వ్యాపారాలు ఏ దేశంలో బాగా సాగుతాయో వీక్షించగల్గేవారు. ఔట్ సోర్సింగ్ ద్వారా ప్రవేశించగలుగుతారు. గతంలో వీరు ఆయా దేశాల్లో పరిశ్రమల మీద పెట్టుబడులు పెట్టేవారు. దీనివల్ల పదిమందికి ఉపాధి లభించేది. ఇప్పుడు తక్షణ లాభాలు తెచ్చిపెట్టే వ్యాపారాల మీద కేంద్రీకరణ ఎక్కువైంది. యుద్ధ పరికరాల ఉత్పత్తి మీద దృష్టి పెట్టారు. వీరి దృష్టిలో గ్లోబలైజేషన్ అంటే అమెరికనైజేషన్ మాత్రమే.

అభద్రతలో మధ్య తరగతి

సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికన్లలో అభద్రతాభావం ఎక్కువైంది. మధ్యతరగతి వర్గాలమీద ముఖ్యంగా వలస వచ్చిన వారిపై ఆ ప్రభావం తీవ్రంగా ఉంది. ఉద్యోగులు చాలా రకాల సమస్యలతో కలవరపడుతున్నారు. మూతపడే పరిశ్రమల సంఖ్య పెరుగుతోంది. మధ్యతరగతి పరిస్థితి దిగజారిపోతోంది. దేశం బావుంది కాని కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉంది అన్న మాట వీరినుండి తరచూ వినిపిస్తుంది.

అమెరికా ఆర్థిక వ్యవస్థ మొత్తం ఇప్పుడు యుద్ధ పరిశ్రమలపైనా, హెవీ ఇంజినీరింగ్ పరిశ్రమలపైనా ఆధారపడి నడుస్తోంది. ప్రపంచంలో యుద్ధాలు ఆగిపోతే దాని ఆర్థికరంగమే కుప్ప కూలిపోతుంది. అందుకే ఏ మూల చూసినా అమెరికన్లు యుద్ధాలు చేస్తూనో లేక యుద్ధాలకు ఆజ్యం పోస్తూనో ఉంటారు. యుద్ధాలమీద దృష్టి పెరిగి మోటారుకార్ల తయారీలో నైపుణ్యం, పెట్రోలు పొదుపు మొదలైన వాటిపై కేంద్రీకరణ లేకపోవటం వల్ల అమెరికన్లు ఈ రంగాల్లో ఇతర దేశాల పోటీ తట్టుకోలేకపోతున్నారు.

పెరుగుతున్న బీద, ధనిక వ్యత్యాసం

అమెరికాలో ఇటీవలి కాలంలో బీద, ధనిక వర్గాల మధ్య అంతరం పెరిగిపోతోంది. ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు ఇతర దేశాలకు పోవడం కూడా ఈ వ్యత్యాసాలు పెరగడానికి కారణం అంటున్నారు. కింది వర్గాల ఆదాయం 1.5 శాతం తగ్గింది. బుష్ ప్రభుత్వం ఉన్నత వర్గాలకు పెంచాల్సిన టాక్స్‌ను తగ్గించింది. దీంతో వ్యత్యాసాలు మరింతగా పెరుగుతున్నాయి. విద్యావకాశాల్లో వచ్చిన తేడాలు పేద, ధనిక వర్గాల మధ్య ఆర్థిక సమతుల్యతను మరింత దెబ్బతీసింది.

అమెరికాలో పర్మిట్లు లేకుండా వలసవచ్చిన లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరు కూలీలుగా దారిద్ర్యంలో మగ్గుతుంటారు. వీరిలో ఎక్కువమంది మెక్సికన్లు.

వారు తమ పని తాము చేసుకుంటారు. ఎవరితో తగవు పెట్టుకోరు. సామాజిక భద్రత స్కీము కింద ప్రభుత్వం ఇచ్చే ఫుడ్ టికెట్లు తీసుకోరు. ఇంగ్లీషు రాదు. అమెరికన్లు చేయని గృహ నిర్మాణ పనులూ, శానిటరీ, గార్డెనింగ్ పనులూ చేస్తారు. వీరు కష్టపడి కంపెనీల ఆదాయం పెంచుతారు. కానీ వారికి మాత్రం కనీస వేతనం కూడా ముట్టదు. దాని కోసం ఆందోళన చేయరు. యూనియన్లు పెట్టరు. వారి ఆదాయంలో ఎక్కువ మొత్తం పన్నుల రూపంలో పోతుంది.



అప్పుల బ్రతుకులు

అమెరికాలో అప్పుల సంస్కృతి ఎక్కువ. నిత్యావసర వస్తువులకు కూడా అప్పు చేస్తారు. దేశంలోని సూపర్ మార్కెట్లు ప్రపంచ ఉత్పత్తులను ఆకర్షణీయంగా ప్రజలముందు ఉంచుతాయి. చౌకగా ఉన్నట్టు భ్రమ కల్పిస్తాయి. అమ్మకం, కొనుగోలు అంతా ఎక్కువగా క్రెడిట్ కార్డుల ద్వారా జరుగుతుంది.

సాంఘిక జీవనంలో హింస పెరిగింది. యువతపై సినిమాలు, డివిడిల ప్రభావం ఎక్కువగా ఉందంటున్నారు. టివిలో 120 గంటలపాటు ప్రసారమైన కార్యక్రమాల్లో 1846 హింసాపూరిత దృశ్యాలు ఉన్నాయని ఒక పరిశోధనా సంస్థ వెల్లడించింది. ఎక్కువమంది హోమ్ థియేటర్లవైపు మొగ్గటం ఎక్కువైంది.

హైస్కూల్ స్థాయిలో విద్యపై ఎక్కువ కృషి జరుగుతోంది. హైస్కూల్‌స్థాయిలో గుణింతం, స్పెల్లింగ్ పోటీలు విపరీతంగా జరుగుతాయి. అయినప్పటికీ కంప్యూటర్లు ఎక్కువగా వాడడం వల్ల విద్యార్థుల్లో రోజురోజుకూ మెదడుతో ఆలోచించే శక్తి తగ్గిపోతుంది. వారు చిన్నచిన్న లెక్కలు కూడా మెదడుతో చేయలేరు. కంప్యూటర్లూ, క్యాలిక్యులేటర్లూ కావలసిందే. ఈ విషయంలో భారత్, ఇంకా ఇతర దక్షిణాసియా, చైనా దేశాలనుండి వచ్చేవారు అమెరికన్ల కన్నా మెరుగ్గా ఉంటారు.

పండుగలకన్నా 'దినాల'కే ప్రాధాన్యం



అమెరికాలో పండుగలకన్నా దినాలకు ('డే'లకు) ప్రాధాన్యత ఎక్కువ. ఆర్భాట ప్రచారంతో మీడియా నిండా ఏదో ఒక దినం గురించి వార్తలు ఇస్తూనే ఉంటారు. అమ్మల దినం, నాన్నల దినం, బాలల దినం, పర్యావరణ దినం, ఫ్రెండ్‌షిప్ డే, వాలెంటైన్స్ డే... ఇలా దినాలకు అంతం ఉండదు. ఆయా దినాలకు అనుగుణంగా కార్పొరేట్ సెక్టార్‌లో అమ్మకా లుంటాయి. మే రెండో ఆదివారం వచ్చే మదర్స్ డే, జూన్ రెండో ఆదివారం వచ్చే ఫాదర్స్ డేలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఇవన్నీ వినిమయ సంస్కృతిలో భాగంగా ఏర్పాటు చేసినవే.

ఎవరి గొడవ వారిదే

ఒకరిగురించి పట్టించుకునే ఓపికా, తీరికా మనదేశంలోనే బాగా తగ్గిపోతోంది. ఇక అమెరికా సంగతైతే చెప్పనవసరంలేదు. ఇక్కడిలా అక్కడ పనిమనుషులను పెట్టుకునే అవకాశం వుండదు గనుక ఇంటిపనంతా ఎవరికి వాళ్ళే చేసుకోవాలి. ఉద్యోగరీత్యా దూరప్రయాణాలు చేసొచ్చి, మళ్ళీ ఇళ్ళలో పనులు చేసుకోవడమే సరిపోతుంది. ఏమాత్రం తీరిక దొరికినా టీవీ చూట్టానికిమించి ఇతర్లగురించి ఆలోచించే ప్రసక్తేలేదు.

ఇంటిపనులు

డిష్‌వాషర్ దగ్గర్నుంచీ అన్నిటికీ సులభంగా చేసుకునేందుకు వీలుగా పరికరాలుంటాయి. అమెరికాలో ఆడపని, మగపని అనే విభజన లేదు. అన్ని పనులూ అందరూ చేస్తారు. ఇక్కణ్ణించి వెళ్ళిన మనవాళ్ళు కూడా అన్ని పనులూ అలవాటు చేసుకుంటారు. మగవాళ్ళు కూడా అంట్లు తోముతారు, వంట చేస్తారు. ఈ సంస్కృతికి అలవాటుపడిన ప్రవాస భారతీయుల ఆడపిల్లలు మనదేశంవారిని పెళ్ళి చేసుకోడానికి ఇష్టపడటంలేదు. వాళ్ళు పురుషాధిపత్యాన్ని సహించేందుకు సుముఖంగా

లేరుగనుక అమెరికన్ కుర్రాళ్ళను చేసుకునేందుకే ఇష్టపడ్తున్నారు. బేబీ కేర్ సెంటర్లు మధ్యతరగతివారికి అందుబాటులో వుండవు. ఎక్కువ ఆదాయం వున్నవారు మాత్రమే ఇటువంటి సదుపాయాలను వినియోగించుకోగలరు.

కాలక్షేపం

మామూలు పనిదినాల్లో ఇక్కడ తీరిక అనే మాటే లేదు. వారాంత సెలవుల్లో మాత్రం 'గెట్ టు గెదర్లు' ఏర్పాటు చేసుకుంటారు. లేదా ఇతర భారతీయ కుటుంబాల ఇళ్ళకు వెళ్తారు. మనవాళ్ళు అక్కడ మైనారిటీలు గనుక విపరీతమైన అభద్రతాభావం వుంటుంది. దాంతో రాజకీయాల్లో బొత్తిగా జోక్యంచేసుకోరు. దేని జోలికీ వెళ్ళకుండా, అన్నిటికీ దూరంగా వుంటూ ఎంతో జాగ్రత్తగా వుంటారు. దీంతో వీళ్ళు ఆధ్యాత్మిక చింతన, గుళ్ళపై దృష్టి పెడ్తున్నారు. అక్కడి దేవాలయాలెంతో పరిశుభ్రంగా వుంటాయి. అక్కడ నృత్య ప్రదర్శనలు కూడా జరుగుతుంటాయి. ఎక్కువమంది ప్రవాసాంధ్రులు తమ పిల్లలకు మన సంస్కృతి నేర్పుతున్నారు. ఎక్కడికి వెళ్ళాలనుకున్నా ఫోన్ చేస్తే చాలు వ్యాన్ వచ్చి తీసుకెళ్తుంది. గైడ్ దగ్గరుండి అన్నీ వివరించి చెప్తారు. అయితే ఖర్చు మాత్రం చాలా ఎక్కువ.

మంచి - చెడు

స్త్రీపురుషులిద్దరూ కలిసి పనిచేసుకోవడమనేది ఈ దేశంలో మెచ్చుకోదగ్గ అంశం. వీళ్ళు ఆడ, మగ తేడా పాటించరు. అయితే ఒంటరితనం అనేది ఈ దేశవాసులను ఎక్కువగా పీడిస్తోంది. తల్లిదండ్రులు ఇంకా అనేకమంది ఆత్మీయులను స్వదేశంలోనేయ వదిలివస్తారు. పోతే పరిచయస్తులు లేదా బంధుమిత్రుల ఇళ్ళు సుదూరంలో వుండటాన రాకపోకలు తక్కువ. దీంతో మనసులోని భావాలను పంచుకునేందుకు లేక మథనపడుతుంటారు. ఇంటాబయటా కూడా వత్తిడి ఎక్కువై డిప్రెషన్‌కు గురవుతుంటారు. గుడ్డిలో మెల్లేమిటంటే మానసిక ఆరోగ్యం దెబ్బతిన్నట్లయితే ఎలాంటి సందేహాలు, సంకోచాలూ లేకుండా సైకియాట్రిస్టును కలిసి కౌన్సిలింగ్ తీసుకుంటారు.

నల్లవారి సమర్థత, శక్తి

1960లో మార్టిన్ లూథర్‌కింగ్ జాతి వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాడు. నల్లజాతీయుల సమర్థత పెంచటానికి తీవ్ర కృషి చేశాడు. హక్కుల పోరాటం నల్లవారు చారిత్రక గౌరవాన్ని పొందేలా చేసింది. తెల్లజాతి దురహంకారానికి వ్యతిరేకంగా 'బ్లాక్‌పవర్' అనే భావన వీరిలో ప్రవేశించింది. ఇది ఇతరుల్లో ద్వేషాన్ని పెంచింది. నల్లవారి పట్ల వివక్షత అనేక రూపాల్లో కనిపిస్తుంది. వారు ఇప్పుడు తమ ఉద్యమాన్ని తిరిగి మానవహక్కుల పోరాటంతో లింకు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

భయం నీడలు

అమెరికన్లు ఇప్పటికీ భయం గుప్పిట నుండి బయట పడలేదు. మళ్లీ మళ్లీ ఉగ్రవాద దాడులు జరుగుతాయనేది వారిని వేధిస్తున్న సమస్య. ఉగ్రవాదాన్ని అంతం చేస్తామని అమెరికా పాలకులు చెబుతున్నా పౌరులు వారి మాటలు విశ్వసించటం లేదు. అమెరికాలో విలువలు కలిగిన ఆలోచనలు తగ్గిపోతున్నాయి. తెలిసీ తెలియని భయంతో అన్నివర్గాలూ ఆందోళనతో గడుపుతున్నారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా సెక్యూరిటీ రూల్స్ పెట్టినా, గుర్తింపు కార్డులు ఇచ్చినా అభద్రతా భావం తగ్గటం లేదు. అధికార వాంఛతో నైతిక విలువలు పాటించటం లేదు. సైన్యం కూడా అంతర్జాతీయ ప్రమాణాలు అనుసరించటం లేదు. భద్రతా చర్యలు కొంచెం తగ్గగానే ఆత్మాహుతి దళాల భయం పైకి వస్తోంది. దాంతో సగటు అమెరికన్లతో పాటు వలస వాదులైన భారతీయులు, తెలుగువారు కూడా భయంతో బ్రతుకుతున్నారు. అమెరికా మీడియాలో చర్చించే అంశాలు మనకు అంతగా రుచించవు. అబార్షన్ మంచిదా? చెడ్డదా? మత్తు మందుల వాడకం, ఇమిగ్రేషన్, ఫ్యాషన్ షోలు, కృత్రిమ గర్భధారణ లాంటి విషయాలను వారు ఎక్కువగా చర్చిస్తుంటారు. ప్రజలు సమస్యల గురించి ఆలోచించకుండా చూస్తారు. దాని ప్రభావం అధికార రాజకీయాలపై పడకుండా జాగ్రత్త పడుతుంటారు. అక్కడ చిన్నచిన్న లెక్కలకూడా కాలిక్యులేటర్ మీద ఆధారపడ్తారు. స్పెలింగ్ తప్పులేమైనా వుంటే కంప్యూటరే కరక్ట్ చేస్తుంది గనుక దానిమీద కూడా ధ్యాసపెట్టరు. జంక్ ఫుడ్‌వల్ల ఊబకాయం వస్తుందని, ఆరోగ్యం పాడవుతుందని తెలిసినా దానిమీదే ఎక్కువ ఆధారపడ్తారు. డబ్బు, కాలం, పరిస్థితులు అనుకూలించక బర్గర్లు, పిజ్జాలు (ఇవి చాలా చౌక, ఒక డాలరుకే బర్గర్ దొరుకుతుంది) లాంటివి తినేసి కడుపు నింపుకుంటారు. కూల్‌డ్రింక్ తాగడం కూడా చాలా ఎక్కువ.

మొత్తం పరిస్థితుల్ని ఆకళింపు చేసుకొన్నా, పరిశీలించినా అమెరికన్ల సాంఘిక జీవనంలో మార్పు కనిపిస్తుంది. పాత తరానికి చెందిన భారతీయులూ, తెలుగువారూ తమ మనవళ్లనూ, మనవరాళ్లనూ జన్మభూమికి రావాలనుకునేదిశగా ప్రేరేపిస్తున్నారు. ప్రపంచీకరణ యుగంలో మనం అమెరికాలో ఉన్నా, అనకాపల్లిలో ఉన్నా ప్రతిభను చాటుకోవచ్చని, సంపాదన కూడా చేసుకోవచ్చునని నచ్చ చెపుతున్నారు. అందుకే ఇప్పుడు మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ కూడా ఎన్‌ఆర్‌ఐ ల సందడి ఎక్కువైంది. *



డా॥ కెవి సుబ్బారావు,
లివర్ ట్రాన్స్‌ప్లాంట్
స్పెషలిస్ట్



కాలేయానికి ఎన్ని పనులో

మన శరీరంలోని ఏ అవయవం ప్రాముఖ్యత దానిదే. అందులో కాలేయం సుమారు ఐదు వందలకు పైగా విధులను నిర్వర్తిస్తుంటుంది. కాలేయం దాదాపు వెయ్యి ఎంజైమ్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఎనభై శాతం కాలేయపు కణాలు ఏ కారణంగానైనా దెబ్బతిన్నట్లయితే మిగిలిన 20 శాతం కాలేయం కొన్ని నెలల్లో పూర్తిస్థాయికి పెరుగుతుంది. ఏ వయసులోనైనా మామూలు విధులు నిర్వర్తించడానికి కాలేయంలో పదిహేను శాతం కణాలుంటే చాలు.

రక్తాన్ని గడ్డకట్టించే ఫ్యాక్టర్లు ఇక్కడే పుడతాయి. రోగనిరోధకశక్తికి ఎన్నో యాంటిబాడీస్‌ని కాలేయం ఉత్పత్తి చేస్తుంది. రక్తంలోని కొవ్వు, ప్రోటీన్లను తనలో నిలవ ఉంచుకుంటుంది. శరీరానికి పనికిరాని వ్యర్థాలను మలమూత్రాలుగా మారుస్తుంది. మూత్రపిండాలు, పేగులు వీటిని బయటకు పంపేస్తాయి. శరీరంలో ఎక్కువైన హార్మోన్లను లాగేస్తుంది. గ్లూకోజ్ ఎక్కువగా ఉంటే గ్లైకోజెన్‌గా మార్చి, నిలవ ఉంచి అవసరమైనప్పుడు తిరిగి కణాలకు అందిస్తుంది. విషపదార్థాలను రక్తంలోకి లాగి బయటకి పంపేస్తుంది. ఎర్ర రక్త కణాలు పగిలి కొత్తవి పుడుతుంటాయి. పగిలిన వాటిలో ఐరన్ ఉంటుంది. మిగతా వ్యర్థ పదార్థాలు బయటకు పోయేటట్లు చేస్తుంది. విసర్జనకు తోడ్పడే బైల్‌జ్యూస్ కాలేయంలో ఉత్పత్తి అవుతుంది.

కాలేయం ఎలా, ఎంత దెబ్బతిన్నది, ఏయే పనులు చేస్తోంది, ఏ పనులు చేయలేకపోతుందనేది రక్త, మూత్ర పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు. అనుమానం ఉంటే కాయలేం పనితీరుకు సంబంధించిన పరీక్షలు పదిహేను రోజులకోసారి, నెల రోజులకోసారి చేయడంవల్ల రోగం తీరును తెలుసుకోవచ్చు. ఇందులోని ప్రధాన ప్రోటీన్ అల్బుమిన్ తగ్గడం వల్ల హైపో అల్బుమినేమియా వ్యాధి వస్తుంది. ఇది క్రానిక్ కాలేయం వ్యాధి. ప్రోథ్రాంబిన్ టైమ్ అనే పరీక్షల ఈ రక్తాన్ని గడ్డకట్టించే పదార్థాలు ఎంత తక్కువయ్యాయో, లివర్ సింథటిక్ ఫంక్షన్‌ను తెలుపుతుంది. టోటల్ సిరమ్ గ్లోబ్యులిన్ పరీక్ష ద్వారా ప్రోటీన్‌ను అంచనా వేసి కాలేయ వ్యాధిని పసిగట్టవచ్చు.

ఎర్ర రక్తకణాల్లోని హిమోగ్లోబిన్ దాని హాఫ్‌టైమ్‌ను బట్టి పగులుతుంది. అలా పగిలినప్పుడు బయటికి వచ్చిన ఐరన్‌ను కాలేయం తీసుకుని హిమోగ్లోబిన్‌ను ముక్కలు చేస్తుంది. ఇందులోని పెరోరింగ్స్ నీటిలో కరగవు. ఇవి బైల్‌రుబిన్‌గా తయారవుతాయి. ఇది నీటిలో కరగదు. కానీ అల్బుమిన్‌లో కలుస్తుంది. తర్వాత ఈ మిశ్రమం రక్తంలోకి సరఫరా అవుతుంది. దీన్ని 'అన్ కాంజుగేటెడ్' బైలురుబిన్ అంటారు. వీటిని, కాలేయ కణాలు తీసుకుని గ్లుకురానిక్ యాసిడ్‌ను కలుపుతాయి. అప్పుడది నీటిలో కరిగి బైల్‌జ్యూస్‌తో విసర్జితమవుతుంది. దీన్ని కాంజుగేటెడ్ బైల్‌రుబిన్ అంటారు. దీనికి పేగుల్లో బాక్టీరియాలోని స్టెల్కో బైలినోజెన్ ఏర్పడుతుంది. ఇది మలంద్వారా బయటకు వెళ్తుంది. మలానికి రంగు దీనివల్లే వస్తుంది. మూత్రంద్వారా యూరో బలినోజెన్‌లుగా మారినవి బయటకు వెళ్తాయి. అప్పుడు మూత్రం పసుపురంగులో ఉంటుంది. మూత్రంలో బైల్ పెగ్మెంట్స్ కనిపించడం కామెర్ల లక్షణం. బైల్‌డక్ట్ మూసుకుపోవడం వల్ల బైల్‌రుబిన్ బయటకు వెళ్లక రక్తంలో దాని శాతం పెరగడంతో కామెర్లు వస్తాయి. కాంజుగేటెడ్, అన్ కాంజుగేటెడ్ బైల్‌రూబిన్, అల్బుమిన్‌ద్వారా, రక్తంద్వారా కణాలకు వెళ్లి కణ కవచం ప్రోటీన్స్‌తో కలుస్తుంది. పిల్లల రక్తంలో బైల్‌రుబిన్ ఎక్కువ ఉండడంవల్ల న్యూరోటాక్సిక్ పరిస్థితి వచ్చి శాశ్వత నష్టం జరగవచ్చు. కాంజుగేటెడ్, అన్ కాంజుగేటెడ్, బైలురుబిన్‌లు ఎంతున్నాయెూ తెలుసుకోవడం అవసరం. హిమోగ్లోబిన్ ఎక్కువ విచ్ఛిన్నం కావడం వల్ల హిమోలైటిక్ కామెర్లు వస్తాయి. కాలేయం దెబ్బతినడానికి మూడు ప్రధాన కారణాలున్నాయి. అవి విషపదార్థాలు, ఇన్‌ఫెక్షన్, షాక్. హఠాత్తుగా కాలేయం దెబ్బతినడాన్ని 'ఇంట్రా హెపాటిక్ అబ్‌స్ట్రక్షన్' అంటారు. దీనికి కారణం అక్యూట్ డామేజ్ ఎక్కువగా ఉండడం. కాలేయం పూర్తిగా పాడై లివర్ సిర్రోసిస్ వస్తుంది.

*

లివర్ చేసే పనులివి...

శరీరంలో అతిపెద్ద అవయవమైన కాలేయం (లివర్) శరీరం తన పనులను తాను సక్రమంగా నిర్వర్తించుకోవడానికి ఎంతగానో తోడ్పడుతుంది. రక్తంలోని విషపదార్థాలను ఇది వేరు చేస్తుంది. ఇన్‌ఫెక్షన్‌ను నిరోధించడానికి అవసరమైన పదార్థాల్ని సృష్టిస్తుంది. రక్తంలోని సూక్ష్మక్రిముల్ని వేరు చేస్తుంది. రక్తం గడ్డ కట్టడానికి అవసరమైన ప్రొటీన్లని లివర్ ఉత్పత్తి చేస్తుంది. లివర్ కొవ్వులను, కొవ్వుల్లో కరిగే విటమిన్లను పీల్చడానికి బైల్ రసాన్ని ఉత్పత్తి చేస్తుంటుంది.

లివర్ దెబ్బతింటే...

లివర్‌లో సిర్రోసిస్ వస్తే మామూలు కణాల్ని స్కార్ కణాలు రీప్లేస్ చేస్తాయి. వాటి వల్ల రక్త ప్రసరణ సరిగా జరగదు. దీన్ని పోర్టల్ హైపర్‌టెన్షన్ అంటారు. దాంతో లివర్ సాధారణంగా చేయాల్సిన పనులను చేయలేకపోతుంది. లివర్ పనిచేయడం మానడంతో, నీరసం, నిస్సత్తువ, ఆకలి లేకపోవడం, వాంతులు, కడుపులో నొప్పి, చర్మం మీద సాలీడులా రక్తనాళాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి ముదిరిన కొద్దీ కనపడే లక్షణాలు.. రక్తస్రావం, జాండీస్, ఎడిమ, ఎసిటిస్, ఎన్‌సెఫలోపతి ప్రారంభమవుతాయి.

కధ

పి.ఎం. సుందర రావు

అమ్మాయి పెళ్లి

"దీపికా, నువ్వు చేస్తున్నదేం బాలేదు. కెరీర్‌కీ అంత కాదు" అంది విసుగు, ఆప్యాయత కలగలిపిన గొంతు పద్మ.

"ఆఫీసు విషయాలు ఇపుడెందుకు పద్మా?" విసుగ్గా అంది దీపిక. ఆమెను అంతచికాకుగా మునుపెన్నడూ చూసి ఎరుగదు పద్మ. ఇక కదిలించటం మంచిది కాదనుకుని. మౌనంగా ఉండిపోయింది.

తన మాటలతో పద్మ హర్టయిందని గుర్తించింది దీపిక. చుట్టూ ఒకసారి చూసి "పద్మా, ప్రశాంతంగా కూర్చుని కాఫీ తాగుదామని తీసుకొచ్చావు. ఇపుడీ గొడవెందుకు" ఈసారి సలహా ఇస్తున్నట్టుగా ఉంది దీపిక గొంతు.

అందుకే కాస్త చొరవగా "రుచులు తీర్చుకోటానికే కాదు. ముఖ్యమైన విషయాలు చర్చించుకోటానికీ ఇలాంటి టిఫిన్ సెంటర్లకు వస్తుంటారు. కాబట్టి తప్పేంలేదు" అంది పద్మ.

ఇక ఉపోద్ఘాతం అనవసరమనుకుంది దీపిక. పద్మ మాటల్ని కట్ చేస్తూ "నేను పనిచేసే చోట, నా కళ్లెదురుగా అన్యాయాలు, అక్రమాలు చోటుచేసుకుంటే చూస్తూ ఊరుకోవటం నావల్ల కాదు. అందుకే ఇంతకుముందు ఎన్నో ఉద్యోగాలు మారాను. ఇప్పుడూ అందుకు సిద్ధంగా ఉన్నాను" అని ఖచ్చితంగా చెప్పేసింది.

"స్వంత మనుషులే యాజమాన్యాన్ని మోసం చేస్తున్నారు. మనమేం చేయగలం. రేపు వాళ్లంతా ఒక్కటైతే..." అంతటితో ఆపేసింది పద్మ.

"ఏం ఫర్వలేదు. తప్పు ఎవరు చేసినా తప్పే. నష్టపోయేది సామాన్య జనమే. వారి మేలును కోరే నేనీ సాహసానికి పాల్పడ్డాను" అని పైకి లేచి కౌంటరు దగ్గరకు దారి తీసింది. దీపికను దాటుకుని వచ్చి బిల్లు చెల్లించింది పద్మ. ఇద్దరూ కలిసి రోడ్డు మీదికొచ్చారు. పద్మ స్కూటీ వెళ్లి పోయింది. సిటీబస్సెక్కి ఇంటికి చేరింది దీపిక. ఇంట్లో ఎదురైన సంఘటనకు ఆశ్చర్యపోయిందామె.

"అమ్మా! మహాతల్లీ! రేపటి నుంచే నీకు మరో ఉద్యోగం చూసే ప్రయత్నంలో ఉంటాను. నీ మొండి పట్టుదల నీదేనా? ఛ... ముదనష్టపు దానా..! కుటుంబ పరువు గురించి గానీ, నీ భవిష్యతు గురించిగానీ ఆలోచించవు. 'పట్టుమని పదిరోజులు ఒక్కచోట కుదురుగా ఉద్యోగం చేయదు. పెళ్లయితే మొగుడితో కాపురమెలా చేస్తుంది' అని నా ముఖాన్నే అడుగుతున్నారు. రోడ్డు మీదికెళ్లాలంటేనే భయంగా ఉంది" అని ఈసడించుకున్నాడు తండ్రి గంగాధరం.

"అప్పుడే విషయం ఇంటిదాకా వచ్చిందా?" అంటూ ఆశ్చర్యపోయింది దీపిక.

"పద్మ ఫోన్ చేసి చెప్పినప్పట్నుంచీ ఆయన గొడవ మరీ ఎక్కువైంది" అంది తల్లి శారద అసలు విషయం ఇదేనన్నట్టు చూస్తూ. అంతపెద్ద విషయాన్ని భార్య తేలిగ్గా చెబుతుందన్న విషయాన్ని జీర్ణించుకోలేని గంగాధర్ భార్యను నానా మాటలు అన్నాడు. తగిన సమాధానం చెప్పబోయింది దీపిక. కానీ కూతురి వాలకాన్ని గమనించిన శారద, ఆయన మాటలు పట్టించుకోకు అంటూ వంట గదిలోకి తీసుకువెళ్లింది.

"ఇద్దరూ ఒక్కటయ్యారుగా. ఇక నా మాటలేం చెల్లుతాయిలే" అనుకుంటూ బయటకు వెళ్లాడు గంగాధర్. దీపిక అలాగే చూస్తుండిపోయింది.

"ఈయనెక్కడికి వెళతాడులే, ఆ చలపతిరావు ఇంటికెళ్లి, తొమ్మిదింటిదాకా కబుర్లు చెబుతాడు. ఇంతలో కడుపులో ఆకలి మొదలవుతుంది. దారి పట్టి ఇంటికొస్తాడు. ఇది రోజూ ఉండే తతంగమేగా.." అంటూ ఆ విషయాన్ని తేలిగ్గా తీసిపారేసింది. భారం తగ్గినట్టినిపించింది దీపికకు. ఫ్రెష్ అయివచ్చింది.

"తినమ్మా!" అంటూ జంతికలున్న ప్లేటును కూతురి చేతికందించింది శారద. "నీ పనుల్ని తప్పుబట్టాలని కాదుగానీ, జాగ్రత్తగా మసులుకోవటం మంచిదికదమ్మా!" సలహా ఇస్తున్నట్టుగా అంది శారద.

దీపికలో ఆక్రోశం ఒక్కసారి పెల్లుబికింది. "నీతీనిజాయితీలతో మెలగాలని నీ పెంపకం నేర్పింది. కళ్లెదుటే చోటుచేసుకుంటున్న అన్యాయాన్ని, అక్రమాన్ని సహించకూడదని నేను నేర్చిన చదువు తెలియజేసింది"

"కానీ ... " అంటూ అడ్డు చెప్పబోయింది శారద.

"నన్ను పూర్తిగా చెప్పనీయమ్మా! నా గుండెల్లో బాధను నీకు మాత్రమే చెప్పుకోగలను. అప్పుడే నా గుండెల్లో బరువు తగ్గుతుంది. అమ్మా! కొంతమంది అపరిశుభ్రమైన ప్రదేశాల్లో ఉంటూ ఆ దుర్గంధాన్ని భరిస్తారు. బతకటానికి అలవాటు పడతారు. కానీ అది ఆరోగ్యకరం కాదు. మనచుట్టూ ఉన్న పరిసరాలు చెత్తాచెదారంతో నిండి ఉన్నపుడు శుభ్రంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఇప్పుడు నేను చేస్తున్నదదే"

అర్థం కానట్టు చూసింది కూతురి వంక శారద.

"నేను పని చేస్తున్న విజయశ్రీ రియల్ ఎస్టేట్‌లో అవినీతి విలయతాండవం చేస్తోంది. దాని ఎమ్‌డి రాఘవరావు అమెరికా వెళ్లారు. మూడు నెలలకు గానీ రారు. మేనల్లుడు సురేంద్రకు కంపెనీ బాధ్యతలు అప్పగించాడు. ఇప్పటివరకూ రాఘవరావుగారు సంపాదించిన మంచి పేరును తుడిచి పెట్టే ప్రయత్నంలో ఉన్నాడు సురేంద్ర. పూర్తిగా తన స్వలాభం కోసం తాపత్రయపడుతున్నాడు. మూడు సంవత్సరాల క్రితం ప్రారంభించిన వెంచర్ ఒకటి పూర్తయింది. వాళ్లందరికీ ఇపుడు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలి. సభ్యుల దగ్గర ఎక్కువ మొత్తం తీసుకున్నాడు. ఒక ప్లాటునే ఇద్దరికీ, ముగ్గురికి రిజిస్ట్రేషన్ చేస్తున్నాడు. కొంతమందికైతే ప్లాట్లు ఇవ్వట్లేదు. ఏవేవో కుంటి సాకులు చెబుతున్నాడు. రెండు వందల ప్లాట్లకు గాను, ఎనభై ప్లాట్లు దాకా మాయంచేసి వాటిని సొమ్ము చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు. దీని వల్ల రాఘవరావు గారికి చెడ్డ పేరు వచ్చింది. ఆయనకు నేను సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తోంది. అందుకే పని చేస్తున్న కంపెనీ యజమాని కోసం, ప్లాట్లు దక్కని సభ్యుల కోసం నేను ఆ సురేంద్ర మీద యుద్ధానికి తలపడ్డాను"

చివరి మాట విని శారద కంగారు పడింది. తల్లి ముఖంలోని ఫీలింగ్‌ను గమనించి, "భయపడకమ్మా! యుద్ధమంటే కత్తులు, కటార్లతో చేసేదికాదు ఆ సురేంద్ర చేస్తున్న అరాచకాల్ని రాఘవరావుగారికి తెలియజేస్తాను" అని వివరంగా చెప్పింది.

కూతురు చేసిన దానిలో తప్పేమీ లేదని గ్రహించింది శారద. కూతురి మాటల వెనుక విచారాన్ని అర్థం చేసుకుని "అమ్మా, దీపికా! పదేళ్ల క్రితం మీ అన్నయ్య శ్రీరామ్ చనిపోయిన దగ్గర్నుంచి ఆయనలో ఈ మార్పొచ్చింది. చీటికీమాటికీ గొడవపడ్డం అప్పట్నుంచే మొదలయింది. ప్చ్! ఈయన ఎందుకిలా మారాడో అర్థం కావటం లేదు. గట్టిగా మాట్లాడితే 'ఆడపిల్ల పెళ్లి చేయాలనే బాధ్యత గుర్తొచ్చినపుడు ఏ తండ్రైనా ఇలానే ప్రవర్తిస్తాడు లేవే!' అంటూ నా నోరు మూయిస్తాడు, నేను అటెండరుగా చేస్తూ సంపాదించినదంతా ఈ కుటుంబాన్ని పోషించటానికే సరిపోయింది. అబ్బాయికి వచ్చిన కట్నంలో అమ్మాయి పెళ్లి చేయొచ్చనుకున్నాను. దురదృష్టం వెంటాడింది. నేను రిటైరవ్వడమూ, శ్రీరామ్ మరణించడమూ ఒకేసారి సంభవించాయి. మార్కెట్లో వరకట్నాల రేట్లు పెరిగిపోతున్నాయి. దీనికి ఎలా పెళ్లి చేయాలో... అసలు చేయగలనో లేదో అర్థం కావటంలేదు' అంటూ మీ నాన్నగారు నా ముందు ఎన్నోసార్లు వాపోయాడు తల్లీ!" అంటూ భర్త మనోగతాన్ని తనకు తెలిసినంతవరకు చెప్పింది శారద.

కాసేపు దీర్ఘంగా ఆలోచించింది దీపిక. తండ్రి ఆవేదనను అర్థం చేసుకుంది.

"నాన్న మనల్ని ఏమైనా అంటే అన్నాడు గానీ, నీవు మాత్రం ఏమీ అనకు" అని అమ్మకు సలహా ఇచ్చింది. "త్వరగా వంటకానివ్వమ్మా!" అంటూ తల్లిని వంట పనుల్లోకి పూరమాయించింది.

❄ ❄ ❄

తన ఛాంబర్‌లోని రింగ్‌ఛైర్‌లో ఎం.డి. రాఘవరావు హుందాగా కూర్చున్నారు. ఎదురుగా ఉన్న ఛైర్‌లో దీపిక కూర్చుంది. "చూడమ్మా! నీవు చొరవ తీసుకుని ఇక్కడ చోటుచేసుకుంటోన్న అక్రమాలన్నింటిని ఇ-మెయిల్ ద్వారా నాకు తెలియజేసినందుకు కృతజ్ఞతలు" అన్నాడు వినమ్రంగా రాఘవరావు.



ఆయన విధేయతకు ఆశ్చర్యపోతూ "థ్యాంక్యూ వెరీమచ్" అనడానికిమించి మరోమాట మాట్లాడలేకపోయింది.

"కంపెనీనే నమ్ముకుని ప్లాట్లు బుక్ చేసుకున్న సభ్యులు మోసపోతున్నారు. దీన్ని నేను సహించను. అందుకు కారణమైన వారు ఎంత ఆప్తులైనా వదలను. ఈ రెండు రోజుల్లో నేను చేసిన ఎంక్వయిరీలో నీవు తెలియజేసినవన్నీ నిజమని తేలింది. నా మేనల్లుడు సురేంద్రను ఊరికే విడిచిపెట్టను. వాడికి తగిన శిక్ష వేస్తాను. మోసపోయిన సభ్యులందరికీ న్యాయం చేస్తాను. ఇంకో విషయం... నిన్ను ఈ క్లర్కు పోస్టునుండి తొలగిస్తున్నాను" అన్నాడు రాఘవరావు.

చివరి మాట విని ఖంగుతిన్నది దీపిక.

అది గమనించిన రాఘవరావు "అలా షాకవ్వకమ్మా! క్లర్కుగా తొలగించి జనరల్ మేనేజర్‌గా నియమిస్తున్నాను" అన్నాడు నవ్వుతూ..

కాసేపు నమ్మలేకపోయింది. వెంటనే తేరుకుని కృతజ్ఞతలు తెలిపింది. ఈ విషయం విని దీపిక తండ్రి ఎంతో సంతోషించాడు. రెండు రోజుల తర్వాత రాఘవరావు "అమ్మా, దీపికా! నీమీద ఉన్న అభిమానంతో చనువు తీసుకుని ఈ ప్రస్తావన తీసుకొస్తున్నాను. మా తమ్ముడి కొడుకు రవీందర్ మంచి ఉద్యోగం చేస్తున్నాడు. వాడికి పెళ్లిచేయాలని మా తమ్ముడు తొందరపడుతున్నాడు. కుటుంబాన్ని సరిదిద్దే సమర్థురాలైతే బావుండునని చెప్పాడు. నాకు వెంటనే నువ్వు గుర్తొచ్చావు. నీకిష్టమైతే మీ నాన్నగారిని కలిసి మాట్లాడతాను" అని చెప్పారు.

ఆలోచించి చెబుతానంది దీపిక. సరేనన్నాడు రాఘవరావు.

రెండురోజుల్లో తనకు తెలిసిన వారి ద్వారా, రవీందర్ గురించి వాకబు చేసింది. మూడోరోజు రాఘవరావుకు తన అంగీకారం తెలిపింది దీపిక.

దీపికారవీందర్‌ల పెళ్లయిపోయింది. పెళ్లి అవుతుందో, కాదోనని దిగులుపడిన గంగాధరం, తన కూతురు దీపిక తన వ్యక్తిత్వం ద్వారా మంచిభర్తను పొందినందుకు ఆనందించాడు. *

మొసళ్ళ వేటగాడి దుర్మరణం

యానిమల్ ప్లానెట్ చూసేవాళ్ళందరికీ స్టీవ్ ఇర్విన్ చిరపరిచితుడు. మొసళ్ళ వేటగాడిగా (క్రోకొడైల్ హంటర్) అతడు ప్రసిద్ధుడు. ఆస్ట్రేలియాలోని క్వీన్‌లాండ్ రాష్ట్ర సముద్రతీరంలో 'ఓషన్స్ డెడ్‌లీస్ట్' పేరుతో తీస్తోన్న సిరీస్‌కోసం షూటింగ్ జరుగుతోంది. 44ఏళ్ళ ఈ అరివీరభయంకరుడు ఎప్పట్లాగే జలచరాలకు అతి సమీపంగా ఈదుతూండగా ఒక జంతువు విషకవచంతో హృదయాన్ని చీల్చిగాయపరిచింది. వెంటనే ఆసుపత్రికి తీసికెళ్ళినప్పటికీ లాభంలేకపోయింది. స్టీవ్ అంతకు కొద్దిసేపటిక్రితమే చనిపోయినట్లు డాక్టర్లు ధృవీకరించారు. స్టీవ్ ఇర్విన్ క్రూరజంతువులతో పోరాటం నిన్నమొన్నటిది కాదు. ఆస్ట్రేలియన్ టెలివిజన్ 'క్రొకొడైల్ హంటర్' పేరుతో 1992లో తొలిసారిగా ఇతని ప్రోగ్రామ్‌ను ప్రసారంచేసింది. అది చూసిన డిస్కవరీ ఛానల్ ఆ కార్యక్రమాన్ని యావత్ ప్రపంచానికి పరిచయం చేసింది. అలా వెలుగులోకి వచ్చిన క్రూరమృగాల యోధుడిపై 2002లో 'ది క్రోకొడైల్ హంటర్స్' అనే ఫీచర్ ఫిల్మ్ కూడా వచ్చింది. ఇర్విన్ స్టీవ్ భార్య టెర్రీది అమెరికా. ఆవిడ కూడా భర్త టెలివిజన్ షోలలో పాలుపంచుకుంటూ మొసళ్ళ వేటగత్తెగా పేరుగాంచింది. ఆస్ట్రేలియాలో స్టీవ్ తల్లిదండ్రులు ప్రారంభించిన జంతుప్రదర్శనశాల టూరిస్టులకు పెద్ద ఆకర్షణ. చనిపోయింది సామాన్యుడు కాదు. విషజంతువులను లొంగదీసుకుంటూ అశేషప్రజానీకానికి ఆనందాన్ని ఇచ్చిన గొప్ప ధైర్యశాలి. 2003లో తన చేతులమీదుగా అవార్డందుకున్న స్టీవ్ మరణం గురించి బుష్ తన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశాడు. ఇక ఆస్ట్రేలియన్ పత్రికలైతే 'స్టీవ్ మరణం దేశానికి తీరనిలోటు', 'అతనో అద్భుతం' లాంటి శీర్షికలతో స్టీవ్ గొప్పతనాన్ని వేయినోళ్ళ పొగిడాయి. అందులో అతిశయోక్తేం లేదు. జల్లిని చూస్తేనే మన ఒళ్ళు గగుర్పొడుస్తుంది. అలాంటిది మొసళ్ళతో ఢీకొనడమంటే మాటలా? అతను నిజంగా అద్భుతమే. *

మనమా- మన నమ్మకాలు

రుక్మిణి

అమ్మగారు చెప్పేసింది



కొన్ని సందర్భాల్లో శాస్త్ర విజ్ఞానాన్నీ, నిజాన్నీ 'నమ్మకం' అనే భావన అదిమి పెట్టేస్తుంది. అలాంటి సందర్భాల్లో మనం దానికి లొంగిపోవాల్సి వస్తుంది. చైతన్యాన్ని కాసేపు గంపకింద కప్పేయాల్సొస్తుంది. దాన్నే 'మూర్ఖత్వం' అనీ, 'మూఢనమ్మకం' అనీ అంటారు.

మా పెద్దమ్మాయికి పెళ్ళయింది. అయిదేళ్ళు గడిచిపోయాయి. ఈలోపునే మా రెండో అమ్మాయి పెళ్ళి కుదిరింది. పెళ్ళయిన రెండో ఏటనే దానికి బొద్దుగావున్న బాబు పుట్టాడు. అదుగో... ఇక్కడే మన చైతన్యం పునాదులకు బీటలు పడింది. సహజంగానే మా పెద్దమ్మాయిలో ఆరాటం మొదలయింది. దాని అత్తమామల సూటిపోటి మాటలు... అవి ఈ దశను ఇంకా తీవ్రతరం చేస్తాయి. మనసును అల్లకల్లోలం చేస్తాయి. అంటే ఈ 'మూఢత్వానికి' తెరతీసి 'క్లాప్' కొట్టిందన్న మాట!

ఇక "నా కొడుక్కు మరొక కోడల్ని చూసుకుంటే.. అది.. ఒక మనవణ్ణో, మనవరాల్నో... గదిగాని అందిస్తే ... ఎత్తుకుని సంబరపడాలని వుండదారా...!" అని అత్తగారు అన్న మాటలు... దీనికి పరాకాష్ఠ! అంటే క్లయిమాక్స్ అన్నమాట!

ఇక! మొదలయింది తంతు. ఇంట్లో అగరొత్తులు.. విబూదులు.. చన్నీటిస్నానాలు.. ఉపవాసాలు.. గుళ్ళ చుట్టూ ప్రదక్షిణలు... పూజలు..! ముందు దశలో నేనేం పట్టించుకోలేదు. ఏమైనా అంటే ఘర్షణ.

ఒకరోజు మా ఆవిడ నా చెవిలో గుసగుసలాడింది. నేను "నమ్మకంగా" అని అడిగాను "అయ్యో.. అమ్మగారు చెప్పిందండీ.. కురవి వీరభద్రస్వామికి చాలా రోజుల్నుండి అర్చనలు చేస్తోంది గదా... దాని కడుపులో ఆ వీరభద్రుడే వున్నాడు" మురిపెంగా... ముచ్చటగా అంది.

ఈ 'అమ్మగారి' గురించి కాస్త వివరణ ఇవ్వాలి. ఆవిడకు అరవైఏళ్ళు. ఒక విధంగా అనాథ. భర్త పదేళ్ళ క్రితం పోయాడు. ఎవరూ లేరు. ఆవిడ దగ్గరకు 'చాలామంది' వస్తుంటారు. వచ్చేవారు రకరకాల సమస్యల్తో వస్తుంటారు. మరో విషయం.. అన్నీ సక్రమంగా.. సాఫీగా.. సరళంగా వుంటే ఈ పూజలూ... అమ్మగార్ల అవసరం ఏంటి? అట్లా వచ్చి కోరుకోవడం ఎందుకు? అన్ని సమస్యలకు ఆ పరిష్కారం ఒక సామాన్య మానవమాత్రు(రాలు)డు చూపించగలరా? కాన్సరు వచ్చినవాణ్ణి బాగుచేయగలరా.. వ్యాపారంలో దివాళా తీస్తే లక్షలిచ్చి ఆదుకోగలరా? లేదు!
కానీ.. అవిడ వారికి తాత్కాలికంగా 'నమ్మకం' కల్పిస్తుంది. ఆశతో జీవితాన్ని కొనసాగించాలని చెప్తుంది. ఈ వెర్రిమొహాలు 'గొర్రెల్లా' తలాడించి తృప్తిగా ఇళ్ళకు వెళ్ళిపోతారు. ఇదంతా నాకు తెలుసు!

"సర్లే కానీ.. రేపు 'క్రష్ణ డయోగ్నొటిక్' సెంటర్లో పరీక్షలు చేయిస్తే తెలుస్తుంది గదా!' అన్నాను.

"ఎందుకటా?" మా ఆవిడ లపలప చెంపలేసుకుంది.

"పిచ్చి మొహమా... అదికాదే.. మరినీకు మనవడో.. మనవరాలో.. అన్న సంగతి తెలియొద్దా!" అని సముదాయించాను.

మా అమ్మయి అయిష్టంగానే సెంటరుకొచ్చింది. డాక్టరుగారు నాకు సన్నిహితుడు. నిర్ధారణకోసం మూత్రం పట్టుకు రమ్మని మా అమ్మాయికి చిన్న బాటిలు ఇచ్చి పంపాడు. అది తెచ్చింది. దానికి రకరకాల రసాయనాలు కలిపాడు. పెదవి విరిచాడు. మళ్ళీ తెమ్మన్నాడు. అట్లా మూడుసార్లు తెప్పించాడు.

"చూడండి...మీ అమ్మాయి మూత్రానికి బదులు నీళ్ళు నింపి తెస్తోంది ప్ఛ్!" అన్నాడు. నాకు ఒళ్ళు మండిపోయింది. ఆయన మంచివాడు కాబట్టి సరిపోయింది. నేను బాగా కొప్పడింతర్వాత అది యూరిన్ తెచ్చింది. దాన్ని పక్కనే కూర్చోబెట్టుకుని టెస్టులు చేసి పెదవి విరిచాడు.
తర్వాత అల్ట్రాసౌండ్ స్కానింగ్.. దాన్లో కూడా గర్భం వచ్చిన ఛాయలు కన్పించలా! "సిస్ట్ ఫార్మేషన్, మెన్సెస్ ఆగిపోతుంది. ఇది ప్రెగ్నెన్సీ కాదు. మందులు వాడాలి!" అని డాక్టరు విసుక్కున్నాడు. అమ్మాయి వలవల ఏడ్చింది.

ఇదీ మన నమ్మకాల ప్రభావం. తర్వాత కాజీపేటలో మరో డాక్టరమ్మ దగ్గర చిన్న చిన్న ఆపరేషన్లు జరిగి మందులు వాడటం కూడా జరిగింది. చివరికి నిర్ధారణ అయింది. ఇందుకు ఒక సంవత్సరం పట్టింది. తర్వాత అమ్మాయికి పండండి బాబు పుట్టాడు.

మరి ఇవన్నీ గుడ్డి నమ్మకాలు కాదా చెప్పండి?! ఇవి ఎందరికో ఎన్ని విధాలుగానో హాని చేస్తున్నా సరే నిజానిజాలేంటో తెలుసుకోవాలని ప్రయత్నించరు. ప్ఛ్.. ఏం చేద్దాం?!

*



టీ బ్రేక్

ఎం.వి.ఎస్. శర్మ

ఇదన్యాయం

ఓ చర్చిఫాదర్, ఓ టాక్సిడ్రైవర్ మరణించిన తర్వాత స్వర్గానికెళ్ళారు. అక్కడ గుమ్మంలోనే వాళ్ళిద్దర్నీ దేవదూత ఆపాడు. టాక్సీడ్రైవర్‌కి సిల్కుబట్టలు, ఫాదర్‌కి ముతక బట్టలు ఇచ్చి లోపలికెళ్ళమన్నాడు. "ఇదన్యాయం. నాకంటే ఆ డ్రైవరే ప్రభువుకు ఆప్తుడా" అని అడిగాడు ఫాదర్ దుఃఖపడిపోతూ. అవునన్నాడు దేవదూత. 'ఎందుకని' అని రెట్టించాడు ఫాదర్. "నువ్వు ప్రార్థన చేసినపుడల్లా జనాలు చర్చిలో నిద్రపోయేవారు. కానీ అతను డ్రైవింగ్ చేసినపుడల్లా రోడ్డు మీద జనాలంతా ప్రభువుని తల్చుకునేవారు" అన్నాడు దేవదూత.

ఎందుకు?

అప్పారావు: దేవుడా..! నా భార్యనెందుకంత అందంగా పుట్టించావ్?
దేవుడు: నువ్వు ..ఆమెని చూసి ఇష్టపడతావని.
అప్పారావు: ఆమె నవ్వులు అంత మనోహరంగా ఉండేలా ఎందుకు చేశావు?
దేవుడు: నువ్వామె వెంటపడి 'పెళ్లి చేసుకుంటావా' అని అడుగుతావని.
అప్పారావు: మరి ఆమెనెందుకింత తెలివి తక్కువ మొద్దుగా సృష్టించావు?
దేవుడు: తెలివైన స్త్రీ ఐతే నిన్ను పెళ్లిచేసుకోదని.

హోటల్

ఓ స్టార్ హోటల్ రిసెప్షనిస్టుకు ఉదయాన్నే ఓ దేవదాసు ఫోను చేశాడు "ఎవరండీ అక్కడ. ఇక్కడ బార్ ఎన్ని గంటలకి తెరుస్తారయ్యా?" అంటూ. "మధ్యాహ్నం లంచ్ తర్వాత సార్" అని చెప్పాడు రిసెప్షనిస్టు. మరో రెండు గంటలకి మళ్లీ దేవదాసు ఫోను చేసి మళ్ళీ అదే ప్రశ్న అడిగాడు. రిసెప్షనిస్టు మళ్లీ అదే సమాధానం చెప్పాడు. మరో రెండుగంటలయ్యేసరికి మరోసారి దేవదాసు ఫోను. రిసెప్షనిస్టు ఓపికగా "సార్, లంచ్ తర్వాతే బార్ తెరుస్తారని చెప్పేను కద్సార్. మీ కర్జెంటైతే రూం సర్వీస్‌కి ఆర్డర్ చెయ్యండి సార్" అన్నాడు. "అదేం బాబూ..! నేను రూంకి పోవాలంటే ముందు బార్ తెరుచుకోవాలి కదా..!" అన్నాడు బార్‌లోనే రాత్రంతా మందులో మునిగి తేల్తున్న దేవదాసు.

సరిపోతుంది

ఓ గ్రామంలోని మట్టిరోడ్డుమీద బురదగుంటలో దిగబడిపోయిన తన కారును బైటకు లాగడానికి ఎడ్లబండి పాపన్నను పిలిపించాడు సురేష్.

కారును బైటకు లాగాక వందరూపాయల్విబోతే పాపన్న అయిదొందలకు తగ్గనన్నాడు. "అయిదొందలా..! ఈ లెక్కన పగలూ రాత్రీ బాగానే సంపాదిస్తున్నట్టున్నావే" అన్నాడు సురేష్.

"అబ్బే..! ఎక్కడ బాబూ.. రేత్తిరంతా నీళ్ళు తోడి పోసి ఇక్కడ బురదగుంట సెయ్యడానికే సరిపోతుంది" అన్నాడు తలగోక్కుంటూ పాపన్న.

ఓదార్పు

ప్రేమించుకుని ఇటీవలే దంపతులైన జంట అనుష్క, రవితేజ.

ఆరోజు రవితేజ ఆఫీసునుంచి తిరిగిరాగానే అనుష్క "చూడు డియర్, నీకోసం ఎంతో కష్టపడి బాదంఖీర్ చేస్తే దాన్ని కాస్తా మన బొచ్చుకుక్క జూలీ తినేసింది" అంటూ ఏడుపు మొదలెట్టింది.

అప్పుడు రవితేజ "పోనిలే బాధపడకు ప్రియా, నీకింకో బొచ్చుకుక్కను తెచ్చిస్తాగా" అని ఓదార్చాడు.

నేను బి.యస్.సి. ఫైనలియర్ చదువుతున్నాను. నేను ఒక వింత సమస్యతో బాధ పడుతున్నాను. ఇటీవల నేను యువసేన, 7/జి బృందావన్ కాలనీ, బోర్డర్ వంటి చిత్రాలను చూశాను. అవి చూసిన తర్వాత ప్రేమ విఫలం అయినా లేదా అన్యాయం జరిగినా, ఎదురించి తీరాలనే తపన మొదలైంది. 'యువసేన' సినిమాలో నల్గురు యువకులు కలిసి లంచగొండి అధికారులను హతమారుస్తారు. అ సినిమా నన్ను బాగా ఆకట్టుకుంది. నేను కూడా అలా అయిపోయి, కొంతమందితో కలిసి ఒక సేనగా ఏర్పడి అన్యాయాన్ని ఎదురించాలని అనిపిస్తూ వుంటుంది. ఈ చదువులు వృథా అనిపిస్తుంది 'బోర్డర్' సిన్మా చూశాక పాకిస్తాన్ పై బాంబులు వేసి వాళ్ళందరినీ తుదముట్టించాలని అన్పిస్తోంది. నా కోపాన్ని ఆపుకోలేక పోతున్నాను. నేనేం చేయాలో సలహా ఇవ్వగలరు.

వెంకటేష్, జహీరాబాద్

మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్ : 9849130141

హిప్నో కమలాకర్

సమాజానికి మంచి చేయాలనే తపన మంచిదే! ఎలా చేయాలి? ఎపుడు చేయాలి ? ఏ రూపంలో చేయాలి? మొదలైన విషయాల పట్ల మీకు అవగాహన వుండాలి! ఈ సమాజాన్ని ముఖ్యంగా ప్రభావితం చేస్తున్న రంగాలేమిటో తెలుసుకోగల్గాలి. మీరు ముందడుగు వేస్తూ, మీతో బాటు ఇతరులను కూడా నడిపించగలిగే సామర్థ్యాన్ని మీరు కలిగి వుండాలి. దీని కోసం ముందుగా మీరు చదువులో రాణించాలి. సమాజం పట్ల సంపూర్ణమైన అవగాహనను కల్గించే కోర్సులను చదవండి. డిగ్రీలు చదవకుండా, విజ్ఞానం పెంచుకుని సమాజంలో ఆమోదం పొందవచ్చు కానీ చట్టంతో సమస్యలొస్తాయి. అందుకే సమాజంతో బాటు, చట్టాల పట్ల కూడా అవగాహన కల్గి వ్యవహరించడం ద్వారా ప్రతికూలత లేని నాయకునిగా ఎదగొచ్చు. ఉదాహరణకు మాజీ ఐ.ఎ.ఎస్ అధికారి జయప్రకాష్ నాయాయణ్ ని తీసుకోండి. లోక్‌సత్తా సంస్థ ద్వారా అటు సమాజాన్ని జాగృతం చేయడమే కాక, ప్రభుత్వ వ్యవస్థను కూడా నిలదీసి మెరుగైన సమాజం కోసం ఆయన ప్రయత్నిస్తున్నారు. ఆ పద్ధతిలో ఒక తరం నుండి మరొక తరానికి మీ బాధ్యతల్ని అందివ్వడం ద్వారా దీర్ఘకాల లక్ష్యంతో ఫలితాలను సాధించడం సాధ్యమవుతుంది. విద్యార్థి దశలో వున్న యువతరంలో తీవ్రమైన ఉద్వేగాల మూలంగా సాయుధ పోరాటాల వైపు ఎక్కువ మొగ్గుచూపుతూ వుంటారు.

అయితే వీటి మూలంగా ఒక పరిధి మేరకు కొంత ప్రయోజనం సాధించగల్గినా, అనంతరం, అసలుకే మోసం వచ్చే ప్రమాదం వుంటుంది. సమాజాన్ని మార్చటం అన్నది స్వల్పకాల లక్ష్యం కాదు. అది దీర్ఘకాల లక్ష్యం. దాన్ని గుర్తించి వ్యవహరించండి.

నా వయసు 19 సం॥లు. నేను డిగ్రీ ఫస్టియర్ చదువుకుంటున్నాను. నేను చాలా పేదవాణ్ణి. ఎవరూలేని నిస్సహాయుణ్ణి కష్టపడి చదువుకుంటున్నాను. ఈమధ్య అనుకోకుండా ఒకమ్మాయితో పరిచయం ఏర్పడింది. కానీ ఆ అమ్మాయికి నా మీద ఎలాంటి ఫీలింగ్స్ లేవు. నాకు చదువుమీద శ్రద్ధ కుదరడంలేదు. ఏం చేస్తూన్నా ఆ అమ్మాయే గుర్తుకొస్తోంది. నాకు చాలా భయమేస్తోంది. ఈ సమస్యనుండి బయటపడడం ఎలాగో చెప్పండి.

రమేష్, ఖమ్మం.

నువు రాసిన ఉత్తరాన్ని బట్టి ఆర్థిక పరిస్థితుల రీత్యా ఇతరుల నుండి సహాయం పొందవలసిన స్థితిలో ఉన్నావు. ఈ నేపథ్యంలో స్నేహ మాధుర్యాలు నీ జీవితాన్ని పరిమళింపచేస్తాయి. నీ భవిష్యత్తుకు బాటలు వేస్తాయి. అయితే స్నేహానికి ప్రేమ ముసుగు వేసి విఘాతాలు సృష్టించుకోవడం మంచిది కాదు. నీ కుటుంబ పరిస్థితుల రీత్యా ఎవరైనా నీ సమస్యను అర్థం చేసుకుని, ఆత్మీయంగా, అభిమానంగా మాట్లాడుతూ ఉంటే నీవు వారిని ఇష్టపడతావు. ఆ వ్యక్తి మగవాడైతే నీకు ఈ సమస్య రాదు. ఆ వ్యక్తి ఆడపిల్ల కావడం మూలంగా, నువ్వు యుక్త వయసులో అడుగుపెట్టడం మూలంగా నీలో ఏర్పడుతున్న లైంగిక ఆకర్షణకు నీవు ప్రేమ ముసుగు వేస్తున్నావు.

ఇది నీ కెరీర్‌కి ఏ మాత్రం మంచిది కాదు. నీ పరిస్థితి పట్ల సానుభూతితో కూడా ఆమె నీతో స్నేహం చేస్తూ ఉండవచ్చు. కాబట్టి జాగ్రత్తగా మసులుకో. అయితే తానంతట తానుగా ప్రేమిస్తున్నాను అని చెబితే గో ఎ హెడ్.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమ్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ **శ్రీ హిప్నో కమలాకర్** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

మరమనుషుల యుగం మరెంత దూరం!?



రానురాను మనిషికీ, యంత్రానికీ మధ్య గీతలు చెరిగిపోతున్నాయి. మనుషులు చేసే అనేక పనులు యంత్రాలు చేసేస్తున్న యుగంలో మనం ఉన్నాం. మనిషి తొలుత తన కండరాలు చేసే పనిని యంత్రాలకు (పనిముట్లకు) అప్పగించాడు. తర్వాత తన మెదడు చేసేపనిని కూడా కంప్యూటర్లకు (ఎలక్ట్రానిక్ పనిముట్లకు) అప్పగించడం ప్రారంభించాడు. కంప్యూటర్లను యంత్రాలకు అమర్చడంద్వారా 'ఆలోచించే యంత్రాలను' (ఇంటిలిజెంట్ మెషిన్స్) సృష్టించడం ప్రారంభించాడు. వీటినే 'మరఘనుషులు' లేక రోబోట్లు అంటున్నాం. నిజానికి మరమనుషులన్నీ మనిషి రూపంలో ఉండవు. వాటిని ఉపయోగించే రంగాన్ని బట్టి, అవి చేసే పనినిబట్టి రకరకాల రూపాల్లో ఉంటాయి. కొన్ని కేవలం చేతులు చేసే పనులు మాత్రమే చేస్తాయి. అటువంటి మరమనుషులు చేతుల రూపంలో మాత్రమే ఉంటాయి. భూగర్భంలోకీ, గనుల్లోకీ పాక్కుంటూ వేళ్లే మరమనుషులు మరో రూపంలో ఉంటాయి. ఇటీవలి కాలంలో మరపనిమనుషులు వస్తున్నాయి. వాటికి కాళ్లు కూడా ఉంటాయి. మనిషిలాగా అడుగులేస్తూ వెళ్లే మరమనుషులు కొన్నయితే, కాళ్ల స్థానంలో చక్రాలద్వారా నడిచేవి మరికొన్ని. మరమనుషుల 'మెదడు' సామర్థ్యం కూడా చాలా వేగంగా పెంచుకుంటూ పోతున్నారు. ప్రస్తుత వేగంతోనే మరమనుషుల రంగంలో అభివృద్ధి జరిగితే మనిషిని పోలిన ఆలోచనాపరుడైన మరమనిషిని అభివృద్ధిచేసే కాలం మరెంతో దూరంలో ఉండబోదని నిపుణులు చెబుతున్నారు. ఇటువంటి ఆలోచనాపరులైన మరమనుషులకు 'సైబోర్గ్' అనీ, 'యాండ్రాయిడ్' అనీ పేర్లు కూడా పెట్టారు. 'సైబోర్గ్' అంటే కంప్యూటర్ చిప్ ద్వారా సామర్థ్యం పెంచబడిన మనిషి. 'యాండ్రాయిడ్' అంటే మనిషీ-కంప్యూటర్ చిప్‌ల సంకరజీవి. నిజానికి ఇటువంటి రోబోట్లు ఇంకా తయారుకాలేదు. ఇవన్నీ హాలీవుడ్ సినిమాల్లోనూ, టివి సీరియళ్లలోనూ మనకు కనిపించేవే.

రోబోట్ల అభివృద్ధి అనేది, మానవునికి ఉండే పంచేంద్రియాల్లో ఎన్ని ఇంద్రియాలను వాటికి అమర్చగలిగారు అన్నదాన్ని బట్టి ఉంటుంది. చూసే ఇంద్రియాలను ఇప్పుడు తేలిగ్గానే అమర్చగలుగుతున్నారు. కెమెరా కళ్లు సాంకేతికంగా బాగా అభివృద్ధిచెందాయి. వినికిడి పరికరాలు కూడా బాగానే అభివృద్ధిచెందాయి. స్పర్శజ్ఞానం గల పరికరాలను మాత్రం ఇంతవరకు వాటికి అమర్చలేకపోతున్నారు. ఇవి కొంత సంక్లిష్టతతో కూడినవి కావడమే దీనికి కారణం. అయితే ఇటీవల 'నానో టెక్నాలజీ'లో (అణుపరిమాణం గల సూక్ష్మ పరికరాల సాంకేతిక పరిజ్ఞానంలో) జరుగుతున్న అభివృద్ధిని గమనిస్తే త్వరలోనే మరమనుషులు స్పర్శజ్ఞానాన్ని కూడా పూర్తిగా సంపాదించగలవన్న నమ్మకం ఏర్పడుతోంది. అదే జరిగితే అప్పుడు రోబోట్లు నిజంగానే ఇంద్రియజ్ఞానం సంపాదించిన యంత్రాలుగా మారుతాయి. ఇంద్రియాలు అంటే అటువంటి పరికరాలద్వారా లభించే సమాచారాన్ని అందుకుని ప్రాసెస్ చేసే కంప్యూటర్ చిప్‌లను రోబో మెదడుకు అమరిస్తే అప్పుడది ఆలోచనాపరుడైన మరమనిషి అవుతుంది. అయితే మరమనిషి 'విజ్ఞానం' ఎంత పెరిగినప్పటికీ మనిషికీ, మరమనిషికీ మధ్య మౌలికమైన తేడాను ఎవరూ, ఎన్నటికీ చెరిపివేయలేరు. అది వేరే విషయం.



నలభై ఏళ్ల క్రితం మొదటి మరమనిషి వాణిజ్యపరంగా తయారైంది. 1961లో జోసెఫ్ ఏంజెల్‌బెర్గర్ తొలి పారిశ్రామిక మరమనిషిని జనరల్ మోటార్స్ కార్పొరేషన్‌కు అమ్మాడు. అప్పటినుండి పారిశ్రామికరంగంలో మరమనుషులు కొత్తకొత్త రంగాల్లోకి దూసుకుపోతున్నాయి. ప్రస్తుతం ఇవి అనేక రంగాల్లో పనిచేస్తున్నాయి. మరమనుషుల ప్రవేశంవల్ల అనేక రంగాల్లో ఉత్పాదకత, నాణ్యత రెండూ పెరిగాయి. ఉదాహరణకు ఆధునిక కార్లు, ట్రక్కుల నిర్మాణం పనిలో మరమనుషులు పెద్ద ఎత్తున ఉపయోగపడుతున్నాయి. ఈ విషయంలో జపాన్ ముందుండగా, అమెరికా రెండో స్థానం ఆక్రమిస్తోంది. కార్లు, ట్రక్కుల కూర్పు (అసెంబ్లింగ్) పనులను నిర్దిష్టమైన మరమనుషులకు అప్పగిస్తున్నారు. అలాగే ప్రమాదకరమైన అనేక పనులకు ముఖ్యంగా ఎత్తునుండి కిందపడిపోయే అవకాశం ఉన్న పనులు, గాయాలు తగిలే అవకాశమున్న పనులకు వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. మనుషులు చొరడానికి వీల్లేని వాతావరణం ఉన్న ప్రాంతాల్లో కూడా మరమనుషులతో పనులు చేయిస్తున్నారు. అధిక వేడి, శబ్దం, కాలుష్యం గల ప్రాంతాల్లో మనుషులకన్నా మరమనుషులే చక్కగా పనిచేయగలుగుతున్నాయి. బిస్కెట్లు, చాక్లెట్ల ఫ్యాక్టరీల్లో ప్యాకింగ్ పనులకు ఇప్పుడు మరమనుషుల్నే పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నారు. వైద్యరంగంలో మరమనుషులు చాలా బాగా ఉపయోగపడుతున్నాయి. మందుల ప్యాకింగ్‌లోనూ, శస్త్రచికిత్సల్లో వైద్యులకు సహాయకారులుగానూ ఉపయోగపడుతున్నాయి. ఇప్పటివరకు అమెరికా పరిశ్రమల్లో 1,15,000కు పైగా మరమనుషులు పనిచేస్తున్నాయని అంచనా.

'సూక్ష్మ సాంకేతిక పరిజ్ఞానం' (నానోటెక్నాలజీ) అభివృద్ధి చెందుతున్నకొద్దీ రానున్నకాలంలో మరమనుషులు మరింతగా మనకు ఉపయోగపడనున్నారు. ముఖ్యంగా ఇంటి-పనిమనిషిగా అన్నివిధాలా ఉపయోగపడే మరమనుషుల ఉత్పత్తికోసం పెద్ద ఎత్తున పరిశోధనలు సాగుతున్నాయి. శస్త్ర చికిత్సల్లో అత్యంత సూక్ష్మమైన ప్రక్రియలు నిర్వహించే సూక్ష్మ మరమనుషుల రూపకల్పన త్వరలోనే జరుగుతుందంటున్నారు. రానున్నకాలంలో సేవారంగంలో మరమనుషుల వినియోగం బాగా పెరిగే అవకాశం ఉంది. నేరాల అదుపులోనూ, శాంతిభద్రతల పరిరక్షణలోనూ, ప్రమాదాల్లో చిక్కుకున్న మనుషుల రక్షణ రంగంలోనూ భవిష్యత్తులో ఇవి బాగా ఉపయోగపడతాయి. ఇప్పుడు అంతరిక్ష పరిశోధనలో రోబో యంత్రాలు బాగా ఉపయోగపడుతున్నాయి. అయితే రానున్నకాలంలో 'విజ్ఞానవంతమైన' మరమనుషుల ఉత్పత్తి జరిగితే అంతరిక్ష పరిశోధనల్లోనూ, గ్రహాంతర యానాల్లోనూ బాగా ఉపయోగపడతాయి. చంద్రుడు కాకుండా ఇతర గ్రహాలకు మానవుడు వెళ్లి రాగలడో లేదో చెప్పలేం గాని మానవుడు సృష్టించే మరమనుషులు మాత్రం వెళ్లి రాగల రోజులు ఎంతో దూరంలో లేవు.

*

కొత్త పుస్తకాలు

కవి ఆకాంక్షలకు అక్షర మాలిక-నిప్పుకోడి

మనుషులు అనేక రకాలు. వారి స్వభావాలూ అంతే. కొంతమంది తాము జీవిస్తున్న సమాజ స్వరూపస్వభావాలతో పనిలేకుండా నిమిత్తమాత్రులుగా కొనసాగుతుంటారు. మరికొంతమంది ఈ సమాజం చాలా అసౌకర్యంగా ఉందని, దీని స్వభావం మౌలికంగా మారాల్సిఉందని భావిస్తారు. అందుకనుగుణంగా తమతమ పరిధిలో క్రియాశీలంగా ఉపక్రమిస్తారు- నిప్పుకోడి కవితాసంపుటి రచయిత నాగినేని భాస్కరరావు లాగ. కవి వృత్తిరీత్యా డాక్టర్. అదికూడా అంటరాని రోగంగా భావించబడే కుష్టురోగులకు వైద్యం చేసే డాక్టర్. ఈయన మనుషుల్లో శారీరక రోగాల పరిష్కారంతోబాటు సమాజంలో ఉన్న సాంఘిక రోగాల పరిష్కారాల కోసం కవిత్వాన్ని సాధనం చేసుకున్నారు. సామాజిక వేదనను పరికించిన ఈ కవి వృత్తికీ, ప్రవృత్తికీ కూడా సమాన న్యాయం చేస్తున్నాడు. ఇప్పటికే తను రాసిన పలు రచనలను పుస్తక రూపంలో తెచ్చిన నాగినేని భాస్కరరావు, ప్రస్తుతం నిప్పుకోడి కవితా సంపుటి మనముందుంచారు. డాక్టర్ వృత్తికి గల ప్రాధాన్యతను గుర్తిస్తూనే అంతకంటే ప్రాముఖ్యత గల సామాజిక బాధ్యతను గుర్తెరిగి కవితా రూపంలో తన ప్రజాస్వామిక లౌకిక దృక్పథాన్ని ప్రచారం చేస్తున్న ఈ కవి అభినందనీయుడు.

నిప్పుకోడి రచయితలో సామాజిక నిబద్ధత వుంది. తన కవితలన్నీ కూడా ప్రస్తుతం నెలకొన్న వ్యవస్థపై సంధించిన ఆయుధాలే. అందరూ ఉపయోగించే సాధారణ పదాలతో తన వచన కవితలను నిర్మిస్తాడు. ఈ కవి ప్రధానంగా తను గమనించిన సామాజిక అసమంజసతలను వ్యక్తీకరించడంపైనే తప్ప కవిత్వ రూపాన్ని పెద్దగా పట్టించుకున్నట్లుగా కనపడదు. తను రాసిన ప్రతీ కవితా వస్తువూ సమస్యను మనకు వివరించేదే. "అప్పు/ వ్యక్తిస్థాయి నుండి సంస్థలకు/ సంస్థలస్థాయి నుండి రాష్ట్రాలకు/ రాష్ట్రాల స్థాయి నుండి దేశానికి/ దేశస్థాయి నుండి ఖండానికి/ ఖండాల నుండి/ ప్రపంచ బ్యాంకు స్థాయికి/ వామనుడి మూడో పాదంలా/ ప్రజలనెత్తికెక్కి కూర్చుంది" అంటాడు. ప్రపంచ బ్యాంకు రుణం కోసం ఉద్యోగులకు హానిచేసే జి.వో.లు దొంగచాటుగా తెచ్చి ప్రజా చైతన్యంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వ ధోరణి ఈ సందర్భంగా మనకు గుర్తుకువస్తుంది. ప్రస్తుత పాలక వ్యవస్థలో ప్రజలకు జాగురూకత లేనట్లైతే స్వార్థశక్తులతో కూడిన పాలకులు ప్రజలకు హాని కలిగించే నిర్ణయాలు నిస్సిగ్గుగా చేయగలరు. చైతన్యవంతులైన సృజనకారులు ఇలాంటి విషయాల్లో దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

కుష్టురోగులకు వైద్యం చేస్తున్న ఈ డాక్టర్ కవి దాని పేరు చెప్పి డబ్బులు అడుక్కుంటున్న మరో రకం రోగగ్రస్తులను విమర్శిస్తూ "కుష్టురోగులు- అనారోగ్యపు ముద్దుబిడ్డలు/ వీళ్ళను-/ 'హోమ్స్'లో ఉంచి మందులిచ్చి, తిండిపెట్టి, నయంచేసి/ పని నేర్పి పునరావాసం కల్పిస్తామని సంస్థలు పెట్టి/ ఫోటోలు తీసి, ఆల్బంలు తయారుచేసి, ఫైళ్ళు సృష్టించి/అంతర్జాతీయ కుష్టు నివారణ నిధి ముందు/ బంగారు ఫ్రేము కళ్ళద్దాలతో, వెండి పొన్ను కర్రలతో/ పట్టు, జరీ చీరలతో/ సూటూ, బూటూ, హాట్స్‌తో/ ఐదు నక్షత్రాల హోటళ్ళ శీతలావరణమైన గదుల్లో/ యాచన చేస్తున్న ఐదు వేళ్ళ వజ్రపుటుంగరాలు" అంటాడు.

మత వ్యవస్థగురించి కూడా ఈ కవి తీవ్ర స్వరంతో కవిత్వాన్ని రాస్తాడు. "వర్ణ, వర్గ వివక్షతలు పుట్టినట్లు పెల్లుబికిన శబ్దాలు/ వీధికొకడు, ఊరికొకడు, మండలానికొకడు, పరిషత్తుకొకడు/ మన జీవన విధానమని, అదే అభిమతమని/ తామే గురువులమని, మత సర్వస్వాలమని - జెండాలెత్తినారు" అంటూ మతం పేరుతో స్వార్థశక్తులు పేట్రేగటాన్ని కవి విమర్శిస్తాడు.

సమాజంలోని లోపాలను నిశితంగా విమర్శించే ఈ కవి సమగ్ర పరిష్కారం పట్ల తన అవగాహనను సందేహంగా ప్రకటిస్తున్నాడు. "సమస్యలేకుండా రాయలేను/పరిష్కరణ చెప్పటానికి శక్తి లేదు/ శాంతిసౌఖ్యాలు అందరికీ అందాలని/ అది శ్రామిక నియంతృత్వంలోనే వస్తుందని/ శ్రామిక జనపక్షపాతినై అక్షరాల సమరాన్ని అక్షరాలా నే చేస్తా" అంటాడు. ఓ కవితలో "శ్రామిక నియంతృత్వంలోనే వస్తుందని/ శ్రామిక జనపక్షపాతినై అక్షరాల సమరాన్ని అక్షరాలా నే చేస్తా" నంటున్నాడు. ఈ కవి పరిష్కారం తెలియదంటూనే పరిష్కారం వైపుగా ప్రయాణిస్తున్నాడు. శ్రామిక నియంతృత్వంలోనే అన్ని సమస్యలకూ పరిష్కారం వస్తుందని నమ్మిన ఈ కవి ఇంకా సందేహం మిగుల్చుకున్నాడా? అన్పిస్తుంది- ఈ వైరుధ్యాన్ని చూసి. బహుశ ప్రపంచీకరణ ప్రభావంతోనేమో!

విస్తృతమైన వస్తువైవిధ్యంతో ఈ కవితాసంపుటి పాఠకులను అలరిస్తుంది. ప్రధానంగా కవిత్వాన్ని మించి కవి భావాలను పాఠకులు ఆస్వాదించే అవకాశం ఉంది. వర్తమాన ప్రపంచంలో మార్కెట్ శక్తుల విజృంభన నేపథ్యంలో శ్రామిక పక్షపాతంతో సృజన చేస్తూ దృఢంగా ముందుకు సాగే ఈ కవి అభినందనీయుడు. మరింత పదునుగా ముందు ముందు మరిన్ని రచనలద్వారా రచయిత తన భావాలను ప్రకటిస్తారని ఆశిద్దాం.

- వీరప్రసాద్

(నిప్పుకోడి కవితా సంపుటి,
రచయిత: నాగినేని భాస్కర రావు,
పేజీలు: 120, వెల: 45/-,
ప్రచురణ: ప్రజాశక్తి బుక్‌హౌస్)

కొల్లేరు

ఎస్.ఆర్. భల్లం

వెల: 25/-,

పేజీలు: 53

ప్రతులకు :

విశాలాంధ్ర బుక్ హౌస్,

ప్రజాశక్తి బుక్ హౌస్

నవోదయ బుక్‌హౌస్



బాలల కొలువు

పిల్లలకో పిలుపు (దీర్ఘ కవిత)

ఎన్.సి.హెచ్. చక్రవర్తి

వెల: 20/-, పేజీలు: 41

ప్రతులకు :

ఎన్.సి.హెచ్. చక్రవర్తి,

ఇంటి. నెం. 7/23

సారపాక - 507 128, ఖమ్మం జిల్లా.



తోటక్ చెన

కావలసిన పదార్థాలు

తోటకూర కట్టలు	-	4
కాబూలీ శనగలు	-	ఒక కప్పు
పచ్చి మిరపకాయలు	-	నాలుగైదు
వెల్లుల్లి రేకులు	-	అవసరమైనన్ని
కర్వేపాకు	-	రెండు రెబ్బలు
టొమేటోలు	-	మూడు
చింతపండు	-	రెండుమూడు రేకులు
లవంగం	-	ఒకటి
జీలకర్ర	-	ఒక చెంచా
ఉల్లిపాయ	-	ఒకటి
నూనె	-	నాలుగు చెంచాలు

తయారుచేసే పద్ధతి

తోటకూరను శుభ్రంగా కడిగిన తరువాత తరగాలి. ఇందులో చిటికెడు పసుపు, ఉప్పు వేసి సన్న సెగమీద ఉడకబెట్టాలి. నానబెట్టిన శనగల్ని గోరంత ఉప్పు వేసి విడిగా ఉడకబెట్టాలి. ఉల్లిపాయ, టొమేటోలు చింతపండు, కర్వేపాకు, పచ్చిమిర్చి మెత్తగా రుబ్బాలి.' ఉడకబెట్టిన తోటకూరను మెత్తగా మెదపాలి. ఆ తరువాత ఒక గిన్నెలో నూనె పోసి లవంగం, జీలకర్ర, వెల్లుల్లీ వేగనివ్వాలి. ఉడకబెట్టిన శనగల్ని కూడా రెండు మూడు నిమిషాలు వేయించి శనగల్ని తీసి పక్కన పెట్టుకోవాలి.

తాలింపులో ఉల్లీ, టొమేటోలు రుబ్బిన మిశ్రమాన్ని దోరగా వేయించాలి. ఇప్పుడు మెదిపిన తోటకూరను కూడా తాలింపులో కలిపి మూడు నాలుగు నిమిషాలు కలియబెట్టాలి. వేడి వేడి అన్నం గానీ, చపాతీలు గానీ ఈ 'తోటక్ చెన' తో కలిపితిని చూడండి. ఆహా ఏమి రుచి! అని ఆనక మీరే అనక మానరు..

- రాజా

రుచి

పెరుగు వడలు



కావలసిన పదార్థాలు

మినప్పప్పు	-	ఒక కప్పు
పెరుగు	-	నాలుగు కప్పులు
పచ్చిమిర్చి తరుగు	-	పావు కప్పు
అల్లం తరుగు	-	పావు కప్పు
కరివేపాకు సన్నగా కట్ చేసినది	-	పావుకప్పు
ఆవాలు	-	ఒక స్పూన్
జీలకర్ర	-	ఒకస్పూన్
ఉప్పు	-	తగినంత
నూనె	-	సరిపడినంత

తయారుచేసే పద్ధతి

మినప్పప్పును మంచి నీటిలో పోసి ఓ పూట నానబెట్టి తరువాత నీరు తీసేసి మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి.

పెరుగును ఓ గిన్నెలోకి తీసుకొని దీనిలో పచ్చిమిర్చి అల్లం, కొత్తిమీర, ఉప్పు, బాగా కలిపి జీలకర్ర, ఆవాలుతో పోపు పెట్టి పక్కనుంచాలి. నూనె కాగనిచ్చి రుబ్బిన మినప్పిండిలో ఉప్పువేసి బాగా కలిపి పాలితిన్ కవర్‌పై నూనె రాసి వడలుగా చేసి నూనెలో వేసి దోరగా వేయించి తీయాలి. ఒకసారి చల్లటి నీటిలో ముంచి తీసి ఇందాకటి పెరుగులో వేయాలి. ఇవి కొద్ది సేపు అలాగే ఉంచితే పెరుగులో నాని చాలా రుచిగా ఉంటాయి.

- జ్యోతి



చూటీ

జరిగిన కథ

తాబేలు పిల్ల బడికి బయలుదేరుతుంది. మార్గమధ్యలో దానికి మిత్రబృందం ఆడుకుంటూ కనిపిస్తుంది. స్కూల్‌కి రమ్మంటే రామంటాయి. తాబేలు ఒక్కటే స్కూలుకెళుతుంది. గుడ్లగూబ టీచర్‌గారు దానికి బోలెడన్ని కొత్త విషయాలు చెప్తారు. సాయంత్రం తిరిగి ఇంటికెళుతున్న తాబేలును ఆపి జంతువులన్నీ వ్యంగ్యంగా మాట్లాడతాయి. పైగా ఆరోజు స్కూల్లో నేర్చుకున్నదాంట్లోంచి ప్రశ్న వెయ్యమంటాయి. తర్వాత ఏం జరిగిందో చూడండి...

"ముందు మెరుపు వస్తుందా? ఉరుము వస్తుందా?" అన్న తాబేలు ప్రశ్న వినగానే అవన్నీ పెద్దగా నవ్వాయి ఒక్కసారిగా. "ఇదో ప్రశ్న. దీనికో జవాబా? ముందు ఉరుము వస్తుంది" అంది ఉడుత.

"కాదు... కాదు. అవి రెండూ ఒకేసారి వస్తాయి" చెట్టు మీది నుంచి దుముకుతూ అంది కోతి.

"నాకు తెలీదు. ఎందుకంటే ఎప్పుడు ఉరుము వచ్చినా నేను కలుగులో దూరి కళ్లు మూసుకుంటానుగా..." అంది ఎలుక తన నెత్తిమీదున్న రెండు వెంట్రుకలను దువ్వుకుంటూ.

"నేను ఎప్పుడూ గమనించనే లేదే" అంది పిచ్చుక అమాయకంగా.

"ముందు మెరుపు వస్తుంది" చెప్పింది కప్ప బెకబెకా.

"అవును. కప్ప చెప్పింది నిజమే. ఉరుము శబ్దం వినడానికి ముందే మెరుపు కనిపిస్తుంది. కారణం ఏంటో చెప్పగలవా" అడిగింది తాబేలు.

"నాకెలా తెలుస్తుంది? అదలాగే జరుగుతుంది" అంది కప్ప గొప్పగా.

"ఎందుకంటే ... శబ్దం కంటే వేగంగా కాంతి ప్రయాణిస్తుంది కాబట్టి. సరే... సింహం గడ్డి తింటుందా?" ప్రశ్నించింది తాబేలు.

దానికి జంతువులన్నీ పెద్దగా నవ్వాయి. "ఒంటరిగా స్కూలు కెళ్లేసరికి దీనికి ఇవాళ కాస్త పిచ్చి పట్టినట్లుంది" అన్నాయి కొన్నయితే.

"సింహం మాంసాహారి. అది మనల్ని తింటుంది. అంతేకాని గడ్డి ఎలా తింటుంది?" తన తెలివంతా ఉపయోగించి అడిగింది కుందేలు.

"మేం బాగా ఆలోచిస్తున్నాం" అన్నాయి మిగతా జంతువులు. దాంతో తాబేలే జవాబు చెప్పనారంభించింది "సింహం కూడా గడ్డి తింటుంది. ఉదాహరణకు గడ్డి మాత్రమే తినే జింకను సింహం తిందనుకోండి. సింహం పొట్టలో గడ్డి వున్నట్టే" అంది తాబేలు.

అంతే... వెంటనే "మరి కప్ప నాలుక వేరేగా ఎందుకుంటుంది?" అనడిగింది పిచ్చుక.

"భలే దానివే. వేరేగా ఎందుకుంటుంది? దాని నాలుక కూడా మన నాలుకమల్లే తడిగా, సన్నగా వుంటుంది" అంది కోతి.

"కానీ...అది మనలాగా దేన్నీ నాకలేదు కదా. అది దేన్నైనా గుటుక్కున మింగేస్తుంది" అంది ఉడుత.

దానికి పాపం కప్ప ఉడుక్కుంటూ "నేను అలా చేస్తానా" అంది.

"కప్పకు నాలుక ముందు నుంచి అతకబడి వుంటుంది. అది తన ఆహారాన్ని చూడడంతోటే నాలుకను బయటికి తెచ్చి పట్టుకుని మింగేస్తుంది" అంది తాబేలు.

జంతువులన్నీ ఆశ్చర్యపోయి "అవునూ...ఇవన్నీ నీకెలా తెలిశాయి? గుడ్లగూబ టీచర్‌గారు చెప్పారా?!" అన్నాయి ఆశ్చర్యంగా.

"అవును. ఇవేకాదు. ఇంకా చాలా చెప్పార్లే..." అంది కాస్త గర్వంగా తాబేలు.

దాంతో అవన్నీ బాగా అసూయ చెందాయి. నీరసంగా, సాలోచనగా ఇంటి దారి పట్టాయి. కానీ వాటన్నిటి ఆలోచనా ఒకేలా వుంది.

"నేనుకూడా తాబేలులా రేపటినుంచి రోజూ బడికెళతాను. బోలెడన్ని విషయాలు నేర్చుకుంటాను" అనుకుంది కుందేలు.

"నేను నా నాలుక గురించి పూర్తిగా తెలుసుకుంటాను" గట్టిగా అనుకుంది కప్ప.

"ఒకవేళ తాబేలు నా గురించి ప్రశ్నిస్తే... నేను సమాధానం చెప్పగలగాలి కదా. అందుకైనా బడికెళతా" అనుకుంది ఎలుక.

"బడికెళ్లినందుకు....అడుగులో అడుగు వేసుకుంటూ నడిచే తాబేలుకే ఇన్ని తెలివితేటలు వస్తే... నేను మాత్రం ఏం తక్కువ తిన్నాను? పాక్కుంటూ స్కూలుకెళ్లి మరీ బోలెడన్ని నేర్చుకుంటాను" అనుకుంది నత్త.

అవన్నీ అలా ఆలోచిస్తూనే రాత్రంతా గడిపాయి. "ఎప్పుడు తెల్లవారుతుందా? ఎప్పుడు స్కూలుకెళదామా?" అని ఎదురుచూస్తూ పడుకున్నాయి.

(అయిపోయింది)